
SRI GAYATRI AYURVEDIC MULTI SPECIALITY CENTRE

GIAYS

శ్రీ గాయత్రి ఆయుర్వేదిక్ మల్టీస్పెషాలిటీ సెంటర్

D.No. 58-15-124, Santhinagar, NAD 'x' Road, Visakhapatnam-530016. Ph : 9247011553

Email: srigayatriayurvedavskp@gmail.com



APTEL RNI NO: 62061/2015

# వార్తావళి

తెలుగు దినపత్రిక




వివాహ మరియు గృహ సంబంధమైన శుభ ముహూర్తములు మరియు పుట్టిన తేది, సమయం, పుట్టిన ప్రాంతం నక్షత్రములు బట్టి జాతకములు వ్రాయబడును

బులుసు వెంకట సుబ్రహ్మణ్యం

M.A. Astrology

#135/B,Sector-3, Ukkunagaram, Vizag-32

e*mail : bulusu333@gmail.com

Ph : 70320 34001, 85001 59006



విశాఖపట్నం : శనివారం 5 సెప్టెంబర్ 2020 | ఎడిటర్ : బులుసు వెంకట సుబ్రహ్మణ్యం | VAARTAVALI TELUGU DAILY | పేజీలు : 8 | రూ. 1.00 | సంపుటి 5 | సంచిక 199


## 3నెలల్లో ఒకేఒక్క కరోనా మరణం!



**వెల్లింగ్టన్:** కరోనావైరస్ మహమ్మారి ధాటికి ప్రపంచదేశాలు వణికిపోతున్నాయి. నిత్యం వేల సంఖ్యలో కేసులు, వందల మరణాలు సంభవిస్తుండడంతో ఆయా దేశాల్లో ఆందోళనకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో వైరస్ తీవ్రతను అదుపుచేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ మహమ్మారిని నియంత్రించడంలో న్యూజిలాండ్ విజయం సాధించిందనే చెప్పవచ్చు. గడిచిన మూడు నెలల్లో ఇక్కడ కేవలం ఒకేఒక్క కరోనా మరణం నమోదయ్యింది. మే 24 తర్వాత తాజాగా మరో కొవిడ్ మరణం చోటుచేసుకుంది. దీంతో దేశంలో ఇప్పటివరకు కరోనా మరణాల సంఖ్య 23కుచేరింది. ప్రపంచదేశాలను వణికిస్తున్నప్పటికీ న్యూజిలాండ్‌లో వైరస్ తీవ్రత తక్కువగానే ఉంది. సమీప దేశమైన ఆస్ట్రేలియాలోనూ పలుచోట్ల వైరస్ విస్తృతంగా వ్యాపిస్తోంది. విదేశీ ప్రయాణాలు లేకపోవడం, కాంటాక్ట్ ట్రేసింగ్ వంటి చర్యలతో దేశంలో కరోనా వైరస్ తీవ్రత అదుపులోనే ఉంది. అయితే, గతనెలలో ఆక్లాండ్‌లో తిరిగి వైరస్ బయటపడింది. దీన్ని నియంత్రించేందుకు అక్కడ రెండు వారాలకుపైగా లాక్‌డౌన్ విధించారు. తాజాగా లాక్‌డౌన్ కాలం ముగుస్తున్న సమయంలోనే యాభై ఏళ్ల వ్యక్తి కొవిడ్ సోకి మరణించినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం అక్కడ కొవిడ్ అప్రమత్తత లెవల్–2.5గా నిర్ధారించిన అధికారులు, పది మంది కంటే ఎక్కువగా ప్రజలు సమూహాలుగా ఏర్పడవద్దని సూచించారు. దాదాపు 102 రోజుల తర్వాత నగరంలో పాజిటివ్ కేసు బయటపడినట్లు అధికారులు తెలిపారు. అయితే, దేశవ్యాప్తంగా సెప్టెంబర్ రెండోవారం వరకు కొవిడ్ నియంత్రణ ఆంక్షలు కొనసాగుతాయని ప్రధానమంత్రి జెసిండా ఆర్డెర్న్ స్పష్టంచేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కొవిడ్ అప్రమత్తత లెవల్–2 గా ప్రకటించారు. దీని ద్వారా ప్రతిఒక్కరు భౌతిక దూరం పాటిస్తూ మాస్కులు ధరించడం తప్పనిసరి. వంద మంది కంటే ఎక్కువ మంది సమూహాలుగా ఏర్పడకూడదు. ఇదిలాఉంటే, జాన్స్‌హాప్కిన్స్ యూనివర్సిటీ నివేదిక ప్రకారం, న్యూజిలాండ్‌లో ఇప్పటివరకు 1764 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వీటిలో ప్రస్తుతం 112కేసులు మాత్రమే యాక్టివ్ ఉన్నట్లు అక్కడి వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. అయితే అత్యంత కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ వైరస్ ఎలా వ్యాప్తి చెందిందనే విషయం మిస్టరీగా ఉన్నట్లు అక్కడి అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# కోవిడ్ పేషెంట్లకు అందుబాటులో వేల బెడ్‌లు



**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 4 :** రాష్ట్రంలో కోవిడ్ పరిస్థితులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. కోవిడ్ ఆస్పత్రుల్లో 37,441 బెడ్లు ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా సీఎంకు తెలిపారు. ఇవ్వాళ్టికి సాధారణ బెడ్లు 2,462, ఆక్సిజన్ సపోర్టుతో ఉన్న బెడ్లు 11,177, ఐసీయూ బెడ్లు 2,651 ఇంకా ఖాళీగా అందుబాటులో ఉన్నాయని సీఎంకు వివరించారు. కొన్ని పత్రికలు కావాలనే విషపూరిత రాతలు రాస్తున్నాయని సమీక్షలో చర్చించారు. కోవిడ్ ఆస్పత్రుల్లో తాత్కాలిక నియామకాలపై అధికారులు ముఖ్యమంత్రికి వివరాలు అందించారు. మొత్తం 30,887 పోస్టులకు గానూ 21,673 పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయగా.. రెగ్యులర్ రిక్రూట్‌మెంట్‌లో 9,971 పోస్టులకుగాను 4,676 పోస్టుల నియామకం పూర్తయిందని పేర్కొన్నారు. ఇందులో 5,295 పోస్టుల భర్తీకి ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. మరో 10 రోజుల్లో వీటి భర్తీ పూర్తవుతుందని అధికారులు తెలిపారు. కోవిడ్ కోసం ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిరోజూ రూ. 10.18 కోట్లు చేస్తోందని వెల్లడించారు. వైరస్ నిర్ధారణ పరీక్షల కోసం రూ. 4.3 కోట్లు, ఆహారం కోసం రూ.1.31 కోట్లు, మందులు కోసం రూ. 4.57 కోట్లు ఖర్చవుతోందని తెలిపారు. కాగా, తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన సమీక్షా కార్యక్రమంలో డిప్యూటీ సీఎం ఆళ్ల నాని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని, వైద్యశాఖ ప్రత్యేక కార్యదర్శి జవహర్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఆరోగ్య శ్రీ సేవల్లో వారే కీలకం

ఆరోగ్యశ్రీ పథకాన్ని నీరుగార్చేలా ఆస్పత్రులు వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ ఆదేశాలు జారీ చేశారు. సేవలు అందరికీ అందుబాటులో ఉండాలంటే ప్రతి ఆరోగ్యశ్రీ ఆస్పత్రిలో హెల్ప్ డెస్క్‌లను పెట్టాలని అధికారులకు సూచించారు. ఆరోగ్య మిత్రలతో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎక్కడ తప్పులు జరిగినా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపానల్ అయిన ప్రతి ఆస్పత్రిలోనూ హెల్ప్ డెస్క్ కచ్చితంగా ఏర్పాటు చేయాలని, రిఫరల్ విధానం చాలా సమర్థవంతంగా ఉండాలని సీఎం స్పష్టం చేశారు. కోవిడ్ ఆస్పత్రుపై ఎలాంటి సమీక్ష చేస్తున్నామో అన్ని ఆరోగ్యశ్రీ ఆస్పత్రులు, ఎంపానల్డ్ ఆస్పత్రులపై సమీక్ష చేయాలని అన్నారు. రోగులకు వైద్యం సరిగ్గా అందలేదంటే వారిని సరైన ఆస్పత్రికి పంపించే బాధ్యత ఆరోగ్యమిత్రలదేనని సీఎం స్పష్టం చేశారు. పతిరోజూ అధికారులు కాల్ సెంటర్లకు మాక్ కాల్ చేసి పనితీరును పరిశీలించాలని చెప్పారు. ప్రతి మాక్ కాల్‌పై వస్తున్న రెస్పాన్స్‌ను కూడా రికార్డు చేయాలని చెప్పారు. ఆహారం, శానిటేషన్, డాక్టర్లు, మౌలిక సదుపాయాలు.. ఈనాలుగు పారామీటర్స్ మీద ప్రశ్నలు వేసి.. రోగులనుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సూచించారు. వీటిద్వారా ఆస్పత్రులకు రేటింగ్ ఇవ్వాలని సీఎం చెప్పారు. కొత్త వైద్య కళాశాలల నిర్మాణం కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్తగా తీసుకొస్తున్న కాలేజీలు ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేస్తాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.



## అక్టోబర్ చివరికి వ్యాక్సిన్ కష్టమే.. సందేహం వ్యక్తం చేసిన ఫౌచీ



**వాషింగ్టన్:** ఈ అక్టోబర్ చివరికల్లా కరోనా వైరస్ వ్యాక్సిన్ అందుబాటులోకి రావటం కష్టమేనని ప్రముఖ అంటువ్యాధుల నిపుణుడు ఆంటోని ఫౌచి అభిప్రాయపడ్డారు. అయితే అది అసాధ్యమేమి కాదని ఆయన అంటున్నారు. కాగా, 2021 ఆరంభంలో కరోనా వ్యాక్సిన్ వచ్చే అవకాశముందని ఆయన ఇదివరకు వెల్లడించిన సంగతి తెలిసిందే. వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చిన ఏడాది లోపు ప్రపంచం సాధారణ పరిస్థితికి చేరుకోగలదని కూడా ఆయన అంచనా వేశారు. అయితే కరోనా కట్టడిలో నిపుణుల మార్గదర్శకాలను సరిగా పాటించకపోతే... దాని ప్రభావం మరి కొన్నాళ్ల పాటు ఎదుర్కోక తప్పదని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. కొవిడ్ వ్యాక్సిన్ అమెరికాలో నవంబర్ 1 కల్లా అందుబాటులోకి రానుందని ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. అంతేకాకుండా దానిని ప్రజలకు పంపిణీ చేసేందుకు సన్నద్ధం కావాలని అన్ని రాష్ట్రాల గవర్నర్లను ఆదేశించింది. ఈ నేపథ్యంలో కొవిడ్–19 వ్యాక్సిన్ ఊహించిన దాని కంటే ముందే అందుబాటులోకి వచ్చే అవకాశముందా అని ఫౌచిని ఓ ఇంటర్వ్యూలో ప్రశ్నించారు. అక్టోబర్ నాటికి కరోనా వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తుందని కొందరు భావిస్తున్నారని... అయితే తాను అలా అనుకోవటం లేదని ఆయన జవాబిచ్చారు.

## ఖాకీ దుస్తులు చూసి గర్వపడాలి: మోదీ



**హైదరాబాద్, వార్తావళి, సెప్టెంబర్ 4 :** ఖాకీ దుస్తులను చూసి గర్వపడాలి తప్ప అహంభావం ఉండకూడదని ప్రధాని మోదీ అన్నారు. కరోనా కట్టడిలో పోలీసులు ముందుండి పోరాడుతున్నారని కితాబిచ్చారు. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో నిర్వహించిన ఐపీఎస్‌ల పాసింగ్ అవుట్ పరేడ్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని మాట్లాడారు. ప్రొబేషనరీ ఐపీఎస్‌లను ఉద్దేశించి స్ఫూర్తిదాయక సందేశమిచ్చారు. యోగా, ప్రాణాయామం ప్రతి ఒక్కరి జీవన విధానంలో భాగం కావాలని అన్నారు. మనసులోనూ యోగా చేయడం చాలా మంచి పద్ధతని చెప్పారు. " కరోనా సంకట పరిస్థితుల్లో పోలీసుల సేవలు ప్రశంసనీయం, కరోనా కట్టడిలో పోలీసులే ముందుండి పోరాడుతున్నారు. కరోనా వేళ మానవతా దృక్పథంతో సేవలందిస్తున్నారు. కరోనా కష్ట కాలంలో ఖాకీల మానవీయ కోణం ప్రజలకు తెలిసింది. ఈ కష్టకాలంలో పోలీసుల పాత్రను చరిత్రలో లిఖించారు. ఐపీఎస్ ప్రొబేషనర్లను గతంలో ఇంటికి ఆహ్వానించే వాడిని. కొవిడ్ కారణంగా ముఖాముఖి కలుసుకోలేకపోతున్నా. త్వరలోనే మీతో సమావేశమవుతా" అని మోదీ అన్నారు. ప్రజాసేవలో ఉండే అధికారులు ఆరోగ్యంగా ఉండాలని ప్రధాని మోదీ తెలిపారు. పనిభారం, ఒత్తిడి ప్రభావం ఆరోగ్యంపై పడకుండా చిట్కాలు పాటించాలన్నారు. పనిచేసే చోట ఉపాధ్యాయులు,నిపుణులతో నెలకోసారైనా భేటీ కావాలన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, సహాయక మంత్రి కిషన్‌రెడ్డి, జితేంద్రసింగ్, వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఏడాది 131 మంది ఐపీఎస్ అధికారులు శిక్షణ పూర్తి చేసుకున్నారు. 121 మంది 2018 బ్యాచ్‌కు చెందినవారు కాగా.. మరో 10 మంది 2017 బ్యాచ్‌కు చెందినవారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో 28 మంది మహిళా ప్రొబేషనర్లు ఉన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో 11 మందిని తెలంగాణకు, ఐదుగురిని ఏపీకి కేటాయించారు. పాసింగ్ ఔట్ పరేడ్‌కు తమిళనాడు కేడర్‌కు చెందిన కిరణ్ శృతి నాయకత్వం వహించారు.



## పరిస్థితులు ఉద్రిక్తంగానే ఉన్నాయి: ఆర్మీ చీఫ్

**ఢిల్లీ:** భారత్–చైనా సరిహద్దుల్లో పరిస్థితులు ఉద్రిక్తంగానే ఉన్నట్లు ఆర్మీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణె పేర్కొన్నారు. దేశ భద్రత కోసం ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా బలగాలను మోహరించామని తెలిపారు. ఈశాన్య లద్దాఖ్‌లోని పాంగాంగ్ సరస్సు సమీపంలో చైనా దురాక్రమణకు పాల్పడుతున్న నేపథ్యంలో ఆర్మీ చీఫ్ గురువారం నుంచి ఆ ప్రాంతంలో పర్యటిస్తున్నారు. చైనా దుశ్చర్యను తిప్పికొట్టేందుకు భారత జవాన్లు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. డ్రాగన్‌తో చర్చలు చేపట్టి సమస్యను పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. 'లద్దాఖ్ చేరుకున్నాక సరిహద్దుల్లోని పరిస్థితులపై ఆరా తీశాను. భారత ఆర్మీ ప్రపంచంలోనే ఉత్తమమైనది. దేశం గర్వించేలా వారు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారు' అని స్పష్టం చేశారు. వాస్తవాధీనరేఖ వెంట పరిస్థితులు కాస్త ఉద్రిక్తంగానే ఉన్నట్లు, వాటికి అనుగుణంగా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.


### పాఠకులకు విజ్ఞప్తి

www.vaartavali.com వెబ్‌సైట్‌లో వార్తావళి దినపత్రిక ఇంటర్నెట్ పేపర్ వస్తుందని చెప్పడానికి వార్తావళి దినపత్రిక యాజమాన్యం తెలియపరుస్తున్నది. ఈ అవకాశాన్ని పాఠకులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవల్సిందిగా కోరుతున్నాము.


## టీచర్లు సమాజ వాస్తుశిల్పులు బిశ్వభూషణ్



**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 4 :** ఉపాధ్యాయులు సమాజానికి వాస్తు శిల్పులని, భారతావని నిర్మాణంలో వారి భూమిక ఎంచదగినదని ఏపీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. ఉపాధ్యాయుల సహకారం లేకుండా ఏ సమాజం ప్రగతిశీల మార్గంలో పయనించలేదని పేర్కొన్నారు. సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులందరికీ గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి మొదటి ఉపరాష్ట్రపతిగా, భారత రెండవ రాష్ట్రపతిగా డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. డాక్టర్ రాధాకృష్ణన్ ఆదర్శవంతమైన విద్యావేత్త, పండితునిగానే కాకుండా తత్వవేత్తగా, రచయితగా భారత దేశానికి సేవలు అందించారన్నారు. జీవితంలో ఉన్నత నైతిక విలువలకు కట్టుబడిన మహనీయుడని గవర్నర్ కొనియాడారు.


త్వరలో 'వార్తావళి' తెలుగు దినపత్రిక యూ ట్యూబ్ చానల్ ప్రారంభమవుతుంది.

ఏపిలో వివిధ జిల్లాల్లో, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావలెను.

యూ ట్యూబ్ చానల్‌లో పనిచేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు కావలెను.

bulusu555@gmail.com

మెయిల్‌కి తమ బయోడాటా పంపించగలరు.

YouTube


## జేఈఈ, నీట్‌పై రివ్యూపిటిషన్ కొట్టివేత



**ఢిల్లీ:** ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ, నీట్ పరీక్షల వాయిదా అంశాన్ని సుప్రీం కోర్టు మరోసారి తోసిపుచ్చింది. పరీక్షల విషయంలో గతంలో ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలంటూ భాజపాయేతర పార్టీల పాలనలోని ఆరు రాష్ట్రాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. కరోనా వైరస్ నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ అంశాన్ని పరిశీలించాలంటూ రివ్యూ పిటిషన్ దాఖలు చేశాయి. పిటిషన్‌ను తోసిపుచ్చుతూ పరీక్షల నిర్వహణకే సుప్రీం మొగ్గు చూపింది. గతంలో 11 రాష్ట్రాలకు చెందిన 11 మంది విద్యార్థులు ఈ పరీక్షల వాయిదాను కోరుతూ సుప్రీంను ఆశ్రయించగా... పరీక్షలు నిర్వహించాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. పరీక్షలను వ్యతిరేకిస్తూ పిటిషన్ దాఖలు చేసిన వాటిలో మహారాష్ట్ర, బెంగాల్, పంజాబ్, రాజస్థాన్, ఝార?ండ్, ఛత్తీస్‌గఢ్, పుదుచ్చేరి రాష్ట్రాలు ఉన్నాయి. ఇప్పటికే జేఈఈ పరీక్షలు సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభం కాగా.. నీట్ ఈ నెల 13న జరగనుంది.


### విలేకరులు కావలెను

'వార్తావళి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు పశ్చిమగోదావరి, అనంతపురం, విశాఖ పశ్చిమం, తూర్పు, పాడేరు, అరకు ప్రాంతాల్లో నియోజకవర్గాల వారీగా జిల్లా ఇన్‌చార్జ్‌లుగా కమీషన్ పద్ధతిలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను. ఆసక్తి గల వారు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

7032034001, 8500159006

# సంపాదకీయం

## ఉద్యోగుల భద్రత

తెలుగు రాష్ట్రాలలో ఈ సంవత్సరం భద్రతా లోపాలతో వరుస ప్రమాదాలు, ప్రాణనష్టం జరగడం గమనిస్తున్నాం. ఆ క్రమంలోనే శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రంలో ఆగస్టు 20 రాత్రి జరిగిన అగ్ని ప్రమాదం 9 మంది ప్రాణాలు తీసింది. ఇవి అనవసర మరణాలు. రాత్రి 10:30 గంటల సమయంలో అగ్ని ప్రమాదం మొదలైతే ఏడుగురు జెన్ కో ఉద్యోగులను, బాటరీలు పెట్టడానికి వచ్చిన ఇద్దరు ప్రైవేట్ కంపెనీ ఉద్యోగులను రాత్రి 2:30 సమయంలో ఊపిరాడక చనిపోయే వరకూ లోపల ఉండనీయడం అగ్ని భద్రతా నియమాల ప్రకారం బాధ్యులైన అధికారుల తప్పిదం. సరైన సమయంలో జెన్‌కో యాజమాన్యం స్పందించి లోపల చిక్కుకున్న వారిని బయటకు రమ్మని ఆజ్ఞాపించి ఉంటే వారందరూ బతికేవారు. కనీసం ఉద్యోగులందరికీ అగ్ని ప్రమాదాల సందర్భంగా భద్రతలోను, ఇతర ఆపత్కర సమయాలలో తప్పించుకుని బయటపడడంలోను శిక్షణ ఇచ్చి ఉంటే, ప్రమాదాన్ని ఊహించుకుని చేసే మాక్ డ్రిల్ ఉద్యోగులతో తరచూ చేయించి ఉంటే ప్రాణాలు పోయేవి కావు. మంటలార్పడానికి జల విద్యుత్ కేంద్రంలో చిన్నపాటి కార్బన్ డయాక్సైడ్ నింపిన అగ్నిమాపక సాధనాలు మాత్రమే ఉన్నాయి. అవి మంటలు తొలి దశలో ఉన్నపుడు మాత్రమే ఉపయోగకరం. అగ్ని విస్తరించకుండా అణచి వేసే వ్యవస్థ లేవీ కేంద్రంలో లేవు. అలాంటి స్థితిలో, అగ్ని మాపక సాధనాలతో మంటలు అదుపులోకి రాని పరిస్థితిలో, జెన్ కో ఉద్యోగులు తక్షణం కేంద్రం నుంచి బయటకు వెళ్ళాలి. వారికి అగ్ని ప్రమాదాల సందర్భంగా భద్రతలో తర్ఫీదు లేకపోవడం వల్ల అలా జరగ లేదు. వట్టి చేతులతో మంటలెలా ఆపగలమనుకున్నారు? జెన్ కో యాజమాన్యం వారిని బయటకు రమ్మని ఎందుకు సూచించలేదు? విచారణ జరుపుతున్న కమిటీలు ఈ ప్రశ్నలకు సమాధానాలు కనుగొనాలి. ఇలాంటి ప్రమాదాలకు సంబంధించిన పుస్తకాలు, నివేదికలు, ప్రమాణాలు, పత్రాలు పరిశీలించిన మాకు అవగతమైన కొన్ని విషయాలను ఇక్కడ పేర్కొంటున్నాం. ఈ ప్రమాద మరణాలకి పునాదులు జలవిద్యుత్ కేంద్రం రూపకల్పన, నిర్మాణ దశలలోనే ఏర్పడ్డాయి. ప్రధానంగా అగ్ని ప్రమాదం జరిగే అవకాశాలను ఆ దశలలోనే గుర్తించిన దాఖలాలు లేవు. జల విద్యుత్ కేంద్రం రూపకల్పన సందర్భంగా అగ్ని ప్రమాదం జరిగినపుడు వివిధ అంతస్తుల నుంచి మంటలను తప్పించుకుని బయటకు పోయే మార్గాలకు చేరడానికి అవసరమైన నిర్మాణాలకు చోటు కల్పించ లేదు. ప్లాంటులో ఎక్కడ ఉన్నా మంటల హెచ్చరిక అలారం మోగినపుడు అత్యవసరంగా బయటపడే దారి వరకు వెళ్లడానికి అనువైన మార్గం ఎంత దూరం ఉండాలో నిర్ణయించే ప్రమాణాన్ని అమలు చేయలేదు. జల విద్యుత్ కేంద్రం నిడివి దాదాపు 270 మీటర్లు ఉన్నపుడు కనీసం మూడు బయటకు వెళ్లే ద్వారాలుండాలి. ఆ ద్వారం వెలుపలి నడవా అత్యవసర నిష్క్రమణ మార్గానికి అనుసంధానమై ఉండాలి. అత్యవసర నిష్క్రమణ మార్గాలను అంతర్జాతీయ నియమాల ప్రకారం నిర్మించ లేదు. అందువల్లే అత్యవసర నిష్క్రమణ మెట్ల మార్గాలు రెండూ మంటలు సృష్టించిన పొగ బయటకు పోవడానికి పొగ గొట్టాలుగా మారి, మృత్యు కుహరాలయ్యాయి. ప్రమాణాల ప్రకారం నిష్క్రమణ మార్గంలోకి పొగ రాకుండా, మంటలు తగలకుండా మరో నిర్మాణం చేయాలి. కనీసం రెండు గంటల పాటు మంటలను తట్టుకోగల పదార్థాలతో ఆ నిర్మాణం జరగాలి. పని చేసే మొత్తం ఉద్యోగుల సంఖ్యను బట్టి నిష్క్రమణ మార్గం వెడల్పును నిర్ధారించాలి. అది కనీసం 44 అంగుళాలు అంటే 1.12 మీటర్లు వెడల్పు ఉండాలి. వాలు మార్గమైనా, మెట్లైనా ఎంత వాలు ఉండాలన్న ప్రమాణాల ప్రకారం నిర్మాణం జరగాలి. వాలైతే 4.8 డిగ్రీలు, మెట్లయితే 18 డిగ్రీలు ఉండి ఎక్కడానికి సులువుగా ఉండాలి. ఈ మార్గానికి వెలుతురూ గాలి ఇవ్వడం కోసం అంతరాయం లేని విద్యుత్ వ్యవస్థ ఉండాలి. అది కనీసం గంటన్నర పాటు పని చేయాలి. మార్గం చివర బయటకు దారిచ్చే తలుపు లోపలి నుంచి బయటకు తెరుచుకునేలా ఏర్పాటు ఉండాలి. చేతులతో తోస్తే సులువుగా తెరుచుకోవాలి. విద్యుత్ కేంద్రం నిర్మాణంలో పైన ఉదాహరించిన ప్రమాణాలేవీ పాటించినట్లు లేదు. విచారణ కమిటీలు కేవలం మంటలెందుకొచ్చాయి, ఆటోమాటిక్ వ్యవస్థలెందుకు పని చేయలేదన్న విషయాలకే పరిమితమైతే ఆ కేంద్రంలో పని చేయడంలో ఉన్న విపత్తు అలాగే మిగిలి పోతుంది.

# కన్నీరుపాలయిన పౌరజనం

(నిన్నటి తరువాయి)



సీతాలక్ష్మణుల సహా రథం దిగి పోయాడతను. రామా అంటూ చుట్టుముట్టారు బ్రాహ్మణులు. "ధర్మమూర్తీ! ఇదిగో ఇవన్నీ వాజపేయాది క్రతువుల్లో సంపాదించిన గొడుగులు. ఈ భుజాలపై ఉన్నవి నిత్యాగ్ని హోత్రాలు. మేమంతా యజ్ఞ యాగాలకు సిద్ధమై ఉన్నవాళ్ళం. నువ్వు అయోధ్యకు రాగలిగితేనే, మా యజ్ఞయాగాలు సఫలమవుతాయి. మా దీక్షలు నెరవేరుతాయి." అన్నారు బ్రాహ్మణులు. బాధగా కళ్ళు మూసుకున్నాడు రాముడు. "మేము వృద్ధులం, తలలు పండిన వాళ్ళం. దేహీ అని ఎవరినీ ఇంత వరకూ యాచించి ఎరుగం. నిన్ను అడుగుతున్నాం. ఈ ధూళిలో సాగిలబడి నీకు మొక్కుతున్నాం. మా మొర మన్నించు రామయ్యా! రావయ్యా అయోధ్యకు వెళ్ళిపోదాం." అన్నారు బ్రాహ్మణులు. కళ్ళు తెరచి, సమాధానంగా సన్నగా నవ్వాడు రాముడు. అటుగా చూశాడు. తమసానది కనిపించింద తనికి. ఆ నదిలో అస్త మిస్తున్న సూర్యుడు కూడా కనిపించాడు. తల తిప్పి ఇటు సుమంత్రుని చూశాడు. కళ్ళార్చాడు. వాటి అర్థం తెలుసుకున్న సుమంత్రుడు, గుర్రాల బడలిక తీరేట్టుగా వాటికి నదిలో నీరు తాగించాడు. దాణా పెట్టాడు. వాటిని నిమురుతూ నిల్చున్నాడు.

**కోసల దాటిన రాముడు: గంగను చూసిన దేవుడు**

సూర్యాస్తమయం అయింది. పౌరులసహా తమసాతీరానికి చేరుకున్నాడు రాముడు. కూర్చున్నాడక్కడ. ఎలాంటి అలికిడీ లేదు. గాలిని ఎవరో బంధించినట్టుగా ఉంది. చెట్టుకొమ్మ ఊగడం లేదు. పిట్ట పాడడం లేదు. గమనించాడది రాముడు. పక్కన కూర్చున్న లక్ష్మణునితో అన్నాడిలా."తమ్ముడూ! మనదీక్షలో మొదటిరాత్రి ఈ పవిత్ర తమసాతీరంలో గడుపుతున్నందుకు ఆనందంగా ఉన్నా, ఆకు కూడా కదలక నిల్చున్న ఆ చెట్లనూ, పాటనే మరచి కొమ్మలపై కూర్చున్న ఆ పిట్టలనూ చూస్తోంటే బాధగా ఉంది. మన స్థితిని చూసి అవి జాలిపడుతున్నట్టుగా ఉన్నాయి. భరించ లేకపోతున్నాను." "ఇలాంటివన్నీ సహజం. పట్టించుకోకూడదన్నయ్యా" అన్నాడు లక్ష్మణుడు.చెట్లకింద అడ్డదిడ్డంగా పడుకుని నిద్రలోకి జారుకున్న ముసలి బ్రాహ్మణులనూ, మిగిలిన పౌరులనూ చూశాడు రాముడు. తిండీ, నీరూ మరచి, ఒకరి మీద ఒకరుగా పడుకుని గాఢంగా నిద్రిస్తున్న వారిని చూసి జాలి చెందాడు."ఆ బ్రాహ్మణులనూ, పౌరులనూ చూడు, మనల్ని అభిమానించిన పాపానికి ఎన్ని పాట్లు పడుతున్నారో?" అన్నాడు. కళ్ళు చెమర్చుకున్నాడు. అంతలో తల్లిదండ్రులు గుర్తుకు వచ్చారేమో! ఇలా అన్నాడు రాముడు."తండ్రిగారు ఎలా ఉన్నారో? ఏ స్థితిలో ఉన్నారో? వారిని తలచుకుంటే దుఃఖం ముంచుకొస్తోంది. అమ్మ ఎలా ఉందో? ఎందుకో గుండె ఝల్లుమంటోంది. మనకోసం ఏడ్చిఏడ్చి వాళ్ళిద్దరూ కళ్ళు పోగొట్టుకుంటారేమోనని భయంగా ఉంది.""ఊరుకో అన్నయ్యా! ధైర్యం చిక్కబట్టుకో" చెప్పాడు లక్ష్మణుడు. "త్వరగా భరతుడు వచ్చి, పట్టాభిషేకం చేసుకుంటే... కొంతలో కొంత ఊరటగా ఉంటుంది. అమ్మానాన్నలను నాకంటే ప్రేమగా చూసుకోగలడు భరతుడు." అన్నాడు రాముడు."భరతుడు వస్తాడు, అన్నీ సర్దుకుంటాయి. నువ్వు ఎక్కువగా ఆలోచించకు, ఆరోగ్యానికి మంచిది కాదు.""నువ్వు ఎంత గొప్పవాడివి లక్ష్మణా! నాకోసం వనవాసం చేస్తున్నావు. నాకు అండగా ఉండడమే కాదు, వదినమ్మ రక్షణకు కూడా నడుం కట్టావు. చాలయ్యా! నువ్వు పక్కనుంటే గొప్ప ధైర్యం నాకు." అన్నాడు రాముడు. అతని వరుస చూస్తోంటే ఈ రాత్రంతా ఇలాగే గడుపుతాడనిపించింది లక్ష్మణునికి. విషయాన్ని మళ్ళించే ప్రయత్నం చేశాడు."ఆకలిగా ఉంటే చెప్పు అన్నయ్యా! పండ్లు తీసుకొస్తాను.""ఈ రాత్రికి నీరు తాగే పడుకుంటాను, ఏమీ వద్దు." అన్నాడు రాముడు. సుమంత్ర లక్ష్మణులసహా సంధ్యోపాసన చేశాడు. దోసిటపట్టి కడుపు నిండా నీరు తాగాడు. త్రేన్చాడు.ఎండుటాకులు ఏరి తెచ్చి, పరచి పడకలు ఏర్పాటు చేశారు లక్ష్మణ సుమంత్రులు."బాగా అలసిపోయారు, వదినా, నువ్వా పడుకోండన్నయ్యా" చెప్పాడు లక్ష్మణుడు. పడుకున్నారు. ఇలా పడుకున్నారో లేదో అలా గాఢనిద్రలోకి జారుకున్నారు సీతారాములు. ఇటు పౌరులూ, అటు అన్నా వదినలూ. అంతా మంచి నిద్రలో ఉన్నారు. సుమంత్ర లక్ష్మణులు వారికి కాపలా ఉండి, మెలకువగా ఉండడం కోసం, అయోధ్యలో జరిగిన సంఘటనలను పదపదే గుర్తు చేసుకుంటూ మాట్లాడుకోసాగారు.ఇంకొక జాము రాత్రి ఉన్నదనగా రాముడు మేల్కొన్నాడు. అన్నయ్య మేలుకోవడాన్ని గమనించి, సుమంత్రుని సహా లక్ష్మణుడు సమీపించాడతన్ని. వచ్చిన తమని పట్టించుకోక, చెట్లకింద నిద్రిస్తున్న పౌరులను జాలిగా చూస్తున్న రాముణ్ణి అడిగాడిలా లక్ష్మణుడు."ఏంటన్నయ్యా ఏంటలా చూస్తున్నావు?""ఆ పౌరులను చూస్తోంటే బాధగా వుంది లక్ష్మణా! తిండి లేదు, నీరు లేదు, నిద్రపోతున్నారంతే." తట్టుకోలేనట్టుగా తల పట్టుకున్నాడు రాముడు. "వనవాసం చేయాల్సింది నేను, మీరు కాదు, వద్దు అని ఎంత చెప్పినా వినడం లేదు. ఇంకా చెబితే ప్రాణత్యాగం చేస్తారేమోనని భయంగా ఉంది. మనతో వారు కష్టాలు కొనితెచ్చుకోవడం భరించలేను లక్ష్మణా, భరించలేను. అందుకని..." ఆగాడు రాముడు."అందుకని ఏం చేద్దామో చెప్పు రామయ్యా?" అడిగాడు సుమంత్రుడు. "ఏం చేద్దామంటే... తప్పదు, కొంచెం యుక్తిగా ప్రవర్తిద్దాం." అన్నాడు రాముడు. సీతను తట్టి లేపాడు. సీతాలక్ష్మణులసహా రథాన్ని అధిరోహించాడు.

(మిగతా రేపటి సంచికలో)

# చరిత్రలో సెప్టెంబర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి

**భారతదేశంలో ఉపాధ్యాయ దినోత్సవము**

**1803 : తెలుగు క్రైస్తవ పదకవితా పితామహుడు పురుషోత్తమ చౌదరి జననం.(మ.1890)**

**1888 : భారతదేశపు రెండవ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జననం (మ.1975).**

**1922 : పత్రికా రచయిత, కవి రెంటాల గోపాలకృష్ణ జననం (మ.1995).**

**1926 : తెలుగు రచయిత జానమద్ది హనుమచ్ఛాస్త్రి జననం (మ.2014).**

**1955 : తెలంగాణకు చెందిన విద్యావేత్త, ఆచార్యులు కోదండరాం జననం.**

**1986 : భారతీయ వృక్ష శాస్త్రవేత్త గణపతి తనికైమొని మరణం.(జ.1938)**

**1988 : మహిళా కమ్యూనిస్టు నేత కొ్రికె పద్మావతమ్మ మరణం (జ.1923).**

**1997 : భారతరత్న మరియు నోబెల్ శాంతిబహుమతి గ్రహీత మదర్ తెరెసా మరణం (జ.1910).**

**2010 : భారతీయ శాస్త్ర పరిశోధకుడు హెూమీ సేత్నా మరణం (జ.1923).**

**2013 : మాజీ శాసన సభ్యులు,పీలేరు గాంధీగా సుప్రసిద్ధులు చల్లా కృష్ణనారాయణరెడ్డి మరణం.(జ.1925**

డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ (సెప్టెంబర్ 5, 1888 ఏప్రిల్ 17, 1975) భారతదేశపు మొట్టమొదటి ఉపరాష్ట్రపతి, రెండవ రాష్ట్రపతి. భారతీయ తాత్విక చింతనలో పాశ్చాత్య తత్వాన్ని ప్రవేశ పెట్టారని ప్రతీతి. రెండు పర్యాయాలు ఉపరాష్ట్రపతి పదవి చేపట్టి, తరువాత రాష్ట్రపతిగా ఒక పర్యాయం పదవిని చేపట్టి, భారతదేశపు అత్యంత క్లిష్టకాలంలో (చైనా, పాకిస్తాన్లతో యుద్ధ సమయం) ప్రధానులకు మార్గనిర్దేశం చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ 5-1888న మద్రాసుకు ఈశాన్యంగా 64 కి.మీల దూరమున ఉన్న తిరుత్తణిలో తమిళనాడుకు వలస వెళ్లిన తెలుగుదంపతులు అయి నా సర్వేపల్లి వీరస్వామి, సీతమ్మ దంపతులకు జన్మించాడు. వీరా స్వామి ఒక జమీందారీలో తహసి ల్దార్. వారి మాతృభాష తెలుగు. సర్వేపల్లి బాల్యము, విద్యాభ్యాసము ఎక్కువగా తిరుత్తణి, తిరుపతిలోనే గడిచిపోయాయి. ప్రాథమిక విద్య తిరుత్తణిలో సాగింది. తిరుపతి, నెల్లూరు, మద్రాసు క్రిస్టియన్ కాలేజీ మున్నగుచోట్ల చదివి ఎం.ఏ పట్టా పొందాడు. బాల్యం నుండి అసాధార ణమైన తెలివితేటలు కలవాడాయన. 1906లో 18 సంవత్సరాల చిరుప్రాయంలో శివకామమ్మతో వివాహము జరిగింది. వీరికి ఐదుగురు కూతుళ్ళు, ఒక కుమారుడు కలిగారు. 21 సంవత్సరాలైనా దాటని వయసులో అతను మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో ప్రొఫెసర్ అయ్యాడు. తత్వశాస్త్రంలో అతని ప్రతిభను విని మైసూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి హెచ్.వి.నంజుండయ్య అతనిని పిలిపించి ప్రొఫెసర్ గా నియమించాడు. అతను ఉపన్యాసాలను ఎంతో శ్రద్ధగా వినేవారు విద్యార్థులు. కలకత్తా విశ్వవిద్యాలయంలో ఆచార్య పదవి చేపట్టమని, డా. అశుతోష్ ముఖర్జీ, రవీంద్రనాథ టాగూర్‌లు కోరారు. దాంతో అతను కలకత్తా వెళ్ళాడు. కలకత్తా విశ్వవిద్యాలయంలో



ఆచార్యుడు గా వున్నప్పుడు అతను 'భారతీయ తత్వశాస్త్రం' అన్న గ్రంథం వ్రాశాడు. ఆ గ్రంథం విదేశీ పండితుల ప్రశంసలందుకున్నది. 1931లో డా. సి.ఆర్.రెడ్డి గారి తర్వాత రాధాకృష్ణన్ గారు ఆంధ్రవిశ్వవిద్యాలయం వైస్ ఛాన్సిలర్‌గా పనిచేశారు. అప్పట్లో డా. రాధాకృష్ణన్‌గారి పిలుపునను సరించి ప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీ, హుమయూన్ కబీర్ వంటి మేధావులు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్లుగా పనిచేశారు. 1931లోనే రాధాకృష్ణన్ "లీగ్ ఆఫ్ నేషన్స్ 'ఇంటలెక్చ్యుయల్ కో-ఆపరేషన్ కమిటి'" సభ్యులుగా ఎన్నుకోబడినారు. 1936లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ప్రాచ్యమతాల గౌరవాధ్యపకులయ్యారు. చైనా, అమెరికా దేశాల్లో పర్యటించి పెక్కు ప్రసంగాలు చేశారు. 1946లో ఏర్పడిన భారత రాజ్యాంగ పరిషత్ సభ్యులయ్యారు. 1947 ఆగస్టు 14-15తేదీన మధ్యరాత్రి 'స్వాతంత్ర్యోదయం' సందర్భాన శ్రీ రాధాకృష్ణన్ చేసిన ప్రసంగం సభ్యులను ఎంతో ఉత్తేజపరిచింది. 1949లో భారత దేశంలో ఉన్నత విద్యాసంస్కరణలు ప్రవేశపెట్టాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఒక కమిటి నియమించింది. దానికి అధ్యక్షుడు డా. రాధాకృష్ణన్. డా.రాధాకృష్ణన్, ప్రధాని నెహ్రూ కోరిక మేరకు 1952-62 వరకు భారత ఉపరాష్ట్రపతిగా పనిచేశారు.

# సుదర్శన చక్రం, త్రిశూలం పుట్టుక!

అత్యంత శక్తివంతమైన, తిరుగులేని మహాయుధాలైన సుదర్శన చక్రం, త్రిశూలాల పుట్టుక కథ ఎంతో ఆసక్తికరం. విశ్వకర్మ వీటిని సూర్యుని రజనుతో తయారు చేయడం వెనుక పెద్ద నాటకీయ పరిణామాలే చోటు చేసుకొన్నట్టు పౌరాణిక సాహిత్యం చెబుతున్నది. కశ్యప ప్రజాపతి, అదితిల పెద్ద కొడుకైన సూర్యుడు లోకాలకు వెలుగును ప్రసాదించే కొలువులో కుదురుకున్నాడు. బృహస్పతి చెల్లెలు యోగసిద్ధి (ప్రభ), ప్రభాసుల కొడుకు విశ్వకర్మ. ఈ దేవశిల్పి భార్య హ్లాదిని. వీళ్లమ్మాయి సంజ్ఞా దేవినే సూర్యునికిచ్చి విశ్వకర్మ వివాహం జరిపించాడు. సూర్యుడు-సంజ్ఞ దంపతులకు ముగ్గురు సంతానం కలిగారు. పెద్ద కొడుకు శ్రాద్ధదేవుడికి వైవస్వతుడనీ పేరున్నది. ఇతడు మనువు. మనమిప్పుడు వైవస్వత మన్వంతరంలోనే జీవిస్తున్నాం. రెండవ కొడుకు యముడు. భర్తను కూడినప్పుడు ఆయన తేజస్సును తట్టుకోలేక సంజ్ఞాదేవి కండ్లు మూసుకొన్నదట. సూర్యునికి కోపం వచ్చి 'అఖిల జనైక సంయమనుడైన పుత్రుడు పుడతాడు నీకు' అన్నాడట. 'సంయమించడం' అంటే 'చలించడం'. ప్రాణుల జీవితాలను చలింపజేస్తాడని భావం. ఈ రకంగా అతడు 'పితృలోకాధిపతి' అయినాడు. మూడవ సంతానం యమున. ఈ పర్యాయం సంజ్ఞ కండ్లు మూసుకోలేదు కానీ, భర్తను 'చంచల దృక్కుల'తో చూసింది. 'విలోలిత అ యిన కూతురు పుడుతుంది' అన్నాడు సూర్యుడు. 'విలోలిత' అంటే 'సదా చలించేది'. కనుక, యమున అలలతో కూడింది అయింది. సంజ్ఞకు భర్త తేజస్సును తట్టుకోవడం కష్టమైపోయింది. పైగా ఏ క్షణాన ఏమంటాడో తెలియదు. తన నీడ(ఛాయ)కు ప్రాణం



పోసింది. ఛాయ ము మ్మూర్తులా సంజ్ఞను పోలి ఉన్నది. 'నేను పుట్టింటికి వెళుతున్నాను. తిరిగి వచ్చేవరకు నువు సూర్యునితో కాపురం చెయ్యి ఎట్టి పరిస్థితులలో నువు ఛాయాదేవివన్న సంగతిని సూర్యునికి తెలియనీకు' చెప్పింది సంజ్ఞ. 'సరే'నంది ఛాయ. పుట్టింటికి వెళ్లింది సంజ్ఞ. కొంతకాలం బాగానే వుంది. 'భర్తపై అలిగి వచ్చింది కూతురు' అని గ్రహించిన విశ్వకర్మ తనకి నచ్చజెప్పి అత్తారింటికి పంపించాడు. సంజ్ఞకు భర్త దగ్గరకు వెళ్లడం ఇష్టం లేక అశ్వ రూపాన్ని ధరించి 'బడబ' అనే పేరుతో ఉత్తర కురుభూములలో సంచరించసాగింది. ఛాయకు సూర్యునివల్ల శని, సావర్ణి, తపతి అనే సంతానం కలిగారు. మొదట్లో అందరినీ సమానంగా చూసిన ఛాయకు రాన్రాను సవతి తల్లి లక్షణాలు వచ్చాయి. సంజ్ఞ పిల్లలను తేడాగా చూడసాగింది. దాంతో విషయం సూర్యునికి తెలిసింది. 'తానిప్పటి వరకు కాపురం చేస్తున్నది సంజ్ఞతో కాదు, ఛాయాదేవితో' అని తెలిసిన సూర్యుడు సంజ్ఞను వెదుక్కుంటూ బయలుదేరాడు. ఉత్తర కురుభూములలో 'బడబ'గా సంచరిస్తున్న భార్యను గుర్తుపట్టాడు. ఇన్నాళ్ల విరహవేదన కారణాన సంజ్ఞకూడా అశ్వరూపాన్ని ధరించి వస్తున్న భర్తను ప్రేమపూర్వకంగా ఆహ్వానించింది. అమ్మాయీ, అల్లుడు ఉన్న విషయం తెలుసుకున్న విశ్వకర్మ ఆ ప్రాంతానికి చేరుకొన్నాడు. 'భర్తపైన ఇంత ప్రేమ వున్న దానివి ఇలా వచ్చేశావేంటమ్మా' అని కూతుర్ని మందలించాడు. 'ఆయన దేహాన్నుండి వెలువడే వేడిమిని తట్టుకోలేక పోతున్నాను నాన్నా' అసలు సంగతి చెప్పింది సంజ్ఞాదేవి. 'అల్లుడు ఒప్పుకొంటే ఆయన వేడిని తగ్గిస్తాను' అని విశ్వకర్మ అనడంతో సూర్యుడు 'సరే'నన్నాడు. సూర్య కిరణాలకు చిత్రిక పట్టి వేడిమిని తగ్గించాడు విశ్వకర్మ. దాంతో సంతోషంగా కాపురానికి వెళ్లింది సంజ్ఞాదేవి. ఛాయాదేవి పక్కకు తప్పుకొంది. సూర్యకిరణాలకు చిత్రిక పట్టేప్పుడు రాలిపడ్డ రజనుతో చక్రాయుధాన్ని తయారుచేసి విష్ణుమూర్తికి, త్రిశూలాన్ని చేసి శివునికి, శంఖాలను తయారు చేసి వసువులకు బహుకరించాడు విశ్వకర్మ. ఇంకా మిగిలిన రజనుతో ఇంద్రుని వజ్రాయుధానికి ధారను కూడా పెట్టిచ్చాడు. ఎంతో శక్తివంతమైన ఈ 'దేవతా ఆయుధాల పుట్టుక' వెనుక ఉన్న అసలు కథ ఇదన్నమాట.

## నాలుక చేసే హెచ్చరిక



జబ్బు చేసి డాక్టర్ దగ్గరికి వెళ్తే నాడి చూసి, నోరు తెరిచి నాలుక చూపించమని అడిగేవాళ్లు ఒకప్పుడు ఫ్యామిలీ డాక్టర్లు. నోరు అనేక రకాల అనారోగ్యాలకు సంబంధించిన సంకేతాలను ఇస్తుంది. అందుకే అలా నాలుకను చూపమనేవాళ్లు. చైనా సంప్రదాయిక వైద్యులు దయాబెటిస్‌ను గుర్తించడానికి కూడా నాలుక పరీక్షను చేసేవాళ్లు. అందులో ఉపయోగం లేకపోలేదంటున్నారు ఇప్పటి ఆధునిక పరిశోధకులు. మధుమేహం వచ్చిందని తెలుసుకోవడానికి పెద్దగా సంకేతాలేమీ ఉండవు. టెస్టుల్లో తప్ప షుగర్ వ్యాధి బయటపడదు. అతిగా ఆకలి వేయడం, అతి దాహం, తరచుగా మూత్ర విసర్జన, బరువు తగ్గిపోవడం లాంటి లక్షణాలు కనిపించేసరికే చాలామందికి షుగర్ కంట్రోల్ తప్పి ఉంటుంది. రక్తంలో చక్కెరల మోతాదు ఎక్కువగా ఉందన్న సంకేతాలను నాలుక కూడా ఇస్తుందంటున్నారు పరిశోధకులు. గతంలో చైనా సంప్రదాయిక వైద్యులు ఉపయోగించే షుగర్ పరీక్షను ఇప్పుడు ఆధునిక సైంటిస్టులు కూడా నిర్ధారించారు. రక్తంలో గ్లూకోజ్ ఎక్కువగా ఉందని నాలుక హెచ్చరిస్తుందని పాతకాలం చైనీస్ మెడిసిన్ వైద్యులు నమ్మేవాళ్లు. రక్తంలో గ్లూకోజ్ ఎక్కువగా ఉందని నాలుక హెచ్చరిస్తుంది. క్లీవ్‌లాండ్ క్లినిక్ పరిశోధకుల ప్రకారం నాలుక మండుతూ ఉన్నదంటే రక్తంలో చక్కెరలు పెరిగాయేమోనని అనుమానించాలి. సాధారణంగా నాలుకపై ఫంగల్ ఇన్‌ఫెక్షన్ రావడం వల్ల నోటిపూత ఏర్పడి నాలుక మంట పుడుతుంది. రక్తంలో చక్కెరలు ఎక్కువగా ఉన్నప్పుడు ఈ ఫంగల్ ఇన్‌ఫెక్షన్‌కు అనువైన వాతావరణాన్ని నోటిలోని లాలాజలం కల్పిస్తుంది. అందుకే దయాబెటిస్ ఉన్నవాళ్లలో తరచుగా నోటిపూత, అల్సర్లు, చిగుళ్ల సమస్యలను గమనిస్తుంటాం. అందుకే నోటి ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలు తరచుగా కనిపిస్తున్నాయంటే వెంటనే షుగర్ పరీక్ష చేయించుకోవాలని సూచిస్తున్నారు వైద్య నిపుణులు.

## పాలు తాగడం వల్ల శరీరంలో ఈ మార్పులు జరుగుతాయి!

పాలు తాగడం వల్ల ఎప్పుడూ లాభాలే. కాకపోతే అతి ఏప్పుడైనా అనర్థమే. లిమిట్‌గా తాగితే శరీరానికి కావాల్సిన శక్తి పాలే సమకూరుస్తాయి. కరోనా టైంలో ఎంత స్ట్రాంగ్‌గా ఉంటే అంత మంచిది. నీరసంగా ఉంటే బెదరించడానికి అయినా కరోనా వస్తుంది. అందుకే ప్రతిరోజూ ఒక గ్లాస్ పాలు తాగడం మంచిదంటున్నారు ఆరోగ్య నిపుణులు. మరి పాలు తాగడం వల్ల శరీరంలో జరిగే మార్పులు గురించి ఓ సారి తెలుసుకోండి.పాలు శక్తి వనరుగా కూడా పనిచేస్తుంది. ఇది కండరాల కణజాలాన్ని రిపేర్ చేయడంలో సహాయపడుతుంది. డెయిరీ సంబంధించిన వస్తువులు ఎక్కువగా తీసుకోవడం వల్ల ముఖంపై మెటిమలు సమస్య ఎదురవుతుంది. వీటిని తినడం, తాగడం తగ్గిస్తే ఆటోమేటిగ్‌గా మొటిమలు తగ్గుముఖం పడుతాయి.ఎముకలు దృఢంగా తయారవ్వడానికి పాలు దోహదపడుతాయి. అంతేకాదు దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి. వీటితోపాటు శరీరానికి కావాల్సిన క్యాల్షియాన్ని కూడా అందిస్తుంది.పాలలో పొటాషియం కంటెంట్ అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. చిన్నపిల్లలు ఆహారం తింటున్నప్పటికీ పాలు కూడా తాపించాలి. పాలలో విటమిన్ బి 12 సమృద్ధిగా దొరుకుతుంది. ఇది చర్మకణాలకు కాపాలాగా ఉంటుంది. అంతేకాదు రోగనిరోధక శక్తిని కూడా పెంచుతుంది. పాలు ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేయడానికి సహాయపడుతాయి.

ఆ.వెలి .
పండ్ల కెల్ల రాజు పండు పనస
పండు
పొట్ట విప్ప తొనలు పూర్తి
గుండు
ఏటి కొక్క మారు యేమైన
రుచి చూడు
తెలిసి
మెలగుమయ్యా!
తెలుగువాడ!



- మల్లాది సోమేశ్వర శర్మ, 9603995769

## గాలి ద్వారా 2 మీటర్ల దూరం కరోనా వ్యాప్తి!

ప్రపంచంపై కరోనా వైరస్ దాడి మొదలై 9 నెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ దీని వ్యాప్తికి సంబంధించిన కారణాలపై పరిశోధకులకు స్పష్టత రావడం లేదు. మొదట్లో గాలి ద్వారా వ్యాపించే ప్రమాదం లేదన్న పరిశోధకులు ఆ తర్వాత తమ అభిప్రాయం మార్చుకున్నారు. తాజాగా ఇప్పుడు గాలి ద్వారా రెండు మీటర్ల దూరంలో ఉన్న వ్యక్తికి కూడా ఈ వైరస్ సోకే ప్రమాదముందని తేల్చారు. జామా (జేఏఎంఏ) ఇంటన్నేషనల్ మెడిసిన్‌లో ప్రచురితమైన ఓ అధ్యయనం ప్రకారం.. కరోనా సోకిన వ్యక్తితో ప్రత్యక్షంగా ఎలాంటి కాంటాక్ట్ లేనప్పటికీ గాలి ద్వారా వైరస్ రెండు మీటర్ల దూరంలో ఉన్న ఆరోగ్యవంతుడికి కూడా సోకే ప్రమాదముంది. ఈ ఏడాది జనవరిలో చైనాలో ఓ లక్షణాలు కనిపించని కరోనా రోగి ద్వారా 24 మందికి ఇదే విధంగా కరోనా సోకింది. అతడు బస్సులో ప్రయాణిస్తున్న క్రమంలో.. అతడికి రెండు మీటర్ల దూరంలో ఉన్న వారికి కూడా గాలి ద్వారా వైరస్ సోకింది. ఈ ఘటన వైరస్ తొలినాళ్లలో జరగడంతో.. అప్పటికి మాస్కు తప్పనిసరి నిబంధన అక్కడ లేదు. ఇలా.. నేటికీ కరోనాపై ఒక్కో అధ్యయనంలో ఒక్కో కొత్త విషయం బయటపడుతూనే వస్తోంది.



35వ ప్రసాద్ గార్డెన్, పరిధిలో వున్నా కొంతమంది డ్వాక్రా మహిళా సంఘాలకు వైఎస్ఆర్ ఆసరా రుణమాఫీ కొరకు వివరిస్తూ మహిళా సంఘాలకు అటెండెన్స్ కొరకు బయోమెట్రిక్ ద్వారా మహిళ సంఘ సభ్యులతో తంబు వేయిస్తున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ35వ. వార్డు అధ్యక్షులు, కార్పొరేటర్ అభ్యర్థి. అలుపనకనకరెడ్డి ఈ యొక్క కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి, ఏ ఆది విష్ణు రెడ్డి, వార్డు యూత్ ప్రెసిడెంట్, ఎస్కే యాసీన్,విజయ్, కృష్ణ. వార్డు, ఆర్ పి లు, పైడ్రాజు, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. **– వార్తావళి, విశాఖ దక్షిణం**



ఏఎల్ పురం గ్రామంలో కరోణా వైరస్ ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ర్యాలీ నిర్వహించిన పంచాయతీ అధికారులు. ఈ కార్యకమం వైసిపి నాయకులు చిటికెల భాస్కర్ నాయుడు మరియు గ్రామ వాలంటరీలు పాల్గొన్నారు.
**– వార్తావళి, ఎఎల్‌పురం**

# కరోనా అవునా... కాదా... ఆలోచన వద్దు



**శ్రీకాకుళం, వార్తావళి, సెప్టెంబర్ 4 :** కరోనా లక్షణాలు ఉన్నప్పటికి కరోనా అవునా ? కాదా ? అనే ఆలోచన వద్దని జిల్లా కలెక్టర్ జె నివాస్ ప్రజలను కోరారు. కరోనా లక్షణాలు కనిపించగానే చికిత్సకు రావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేసారు. జిల్లాలో కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా శుక్రవారం ప్రజలను ఉద్దేశించి ఒక సందేశాన్ని విడుదల చేస్తూ జిల్లా కోవిడ్ ఆస్పత్రుల్లో అన్ని సదుపాయాలు కల్పించామని అన్నారు. జిల్లాలో రోజుకు 8 వందల నుండి వెయ్యి కేసులు వరకు నమోదు అవుతున్నాయని ఆయన చెప్పారు. జ్వరం, ఆయాసం వంటి ప్రాథమిక లక్షణాలు ఉన్న వాళ్ళు కరోనా కాదు అనే ధీమాతో ఉంటున్నారని, పరిస్థితులను వాలంటీరుకు వివరింగా తెలియజేసి సరైన చికిత్సను సరైన సమయంలో పొందాలని ఆయన కోరారు. 94 శాతం కంటే తక్కువ ఆక్సిజన్, ఆయాసం, వరుసగా మూడు రోజుల పాటు జ్వరం ఉన్న వారు చికిత్స పొందుటకు ఆలస్యం చేయరాదని ఆయన సూచించారు.

# ఫ్యాక్టరీ ఆధునీకరణకు లోక్‌సత్తా సంపూర్ణ మద్దతు: భీశెట్టి బాబ్జి



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 4 :** భీమసింగి షుగర్ ఫ్యాక్టరీనీ ఆధునీకరణ చేస్తూనే ఫ్యాక్టరీ పరిధిలోని చెరకు రైతులకు అండగా ఉంటామని ప్రకటించిన గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ప్రకటనను లోక్సత్త పార్టీ నుండి స్వాగతిస్తున్నామని లోక్సత్తపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. గురువారం ఎమ్మెల్యే అప్పలనరసయ్య కి ఫ్యాక్టరీ అభివృద్ధి తమపార్టీ తరపున వినతిపత్రం అందచేసిన అనంతరం విలేకరుల తో మాట్లాడుతూ ఈ సంవత్సరం చెరకు గానుగ నిలిపివేయాలని నిర్ణయం చేసిన సందర్భంగా రైతులకు,కార్మికులుకి ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, లోక్సత్తపార్టీ తరపున రైతులకు, ఉద్యోగులకు ఎటువంటి సమస్యలు వచ్చినా వెంటనే స్పందిస్తామని, ఫ్యాక్టరీలో కోట్లాది రూపాయలు విలువైన పంచదార, పాత ఇనుప తుక్కు, బ్రోవున్ షుగర్ నిలువ ఉండిపోయిందని వీటిని అమ్మి కార్మికుల, జీతాలు, పీఎఫ్, గ్రాట్యుటీ చెల్లింపులు చెయ్యాలని, సీనియర్ ఉద్యోగుల, కార్మికులును వోచర్ పేమెంట్ పై తీసుకోవడం సరికాదని, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లామని 46 సంవత్సరాలు వయస్సు కలిగిన ఫ్యాక్టరీకి కనీసం ప్రహరీ లేకపోవడంతో అనేక దొంగతనాలు జరుగుతున్నాయన్నారు.



ఏఎల్ పురం గ్రామంలో సచివాలయం భవనం నిర్మాణం పనులను ఈరోజు నర్సీపట్నం పంచాయతీ డివిజన్ ఇంజనీరింగ్ శాఖ అధికారి ప్రసాద్, జెఈ డిల్లీశ్వరి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో 20 గ్రామ సచివాలయం నిర్మాణం శరవేగంగా జరుగుతున్నాయని రెండు మూడు పంచాయతీల్లో పనులు కొద్దిగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు భాస్కర్ నాయుడు రామకృష్ణ పాల్గొన్నారు.
**– వార్తావళి, ఎఎల్‌పురం**

# శిరోముండనం కిరాతకులను కఠినంగా శిక్షించాలి

**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 4 :** పెందుర్తి సుజాత నగర్ కు చెందిన కర్రీ శ్రీకాంత్ అనే దళిత యువకుడిపై, సినీ నిర్మాత ,నూతన నాయుడు కుటుంబ సభ్యులు శిరోముండనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని, దళిత యువకుడిపై శిరోముండనం కు పాల్పడిన హంతకులను కఠినంగా శిక్షించాలని స్థానిక శ్రీరామ్ నగర్, కాలనీలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి, విగ్రహం దగ్గర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేయడం జరిగింది అని ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా చిన్ని యాదవ్ తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెందుర్తి లో దళిత యువకుడు పై శిరోముండనం చేయడం కిరాతక చర్య అని, సెల్ ఫోన్ దొంగలించాడు అనే నెపంతో ,యువకుడిపై దాడి చేయడం చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడమే అని ,మరి ఇటువంటి దూచర్యకు పాల్పడిన వారు ఎంతటి పెద్ద వారైనా వదిలిపెట్ట వద్దని చట్టం దృష్టిలో అందరూ



సమానమే అని నిరూపించాలంటే , నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి కఠినంగా శిక్షించాలని అన్నారు, ఈ కార్యక్రమంలో పట్టణ యాదవ సంక్షేమ సంఘం నాయకుడు పల్లా సత్య అప్పారావు, ఎస్సీ సంఘం నాయకుడు సారిక సన్యాసిరావు, ముప్పిడి అప్పలకొండ, సత్య అప్పారావు, బండి లక్ష్మణరావు, ఎస్సీ సంఘం యువజన నాయకులు సారిగా శ్రీనివాసరావు, ఆర్ అజయ్ బాబు, సారిక ఈశ్వరరావు, ఆర్ రమేష్,బీసీ సంఘం యువజన నాయకుడు పోలవరపు రాము తదితరులు పాల్గొన్నారు.

# వ్యవస్థలను నాశనం చేస్తున్న వైసిపి ప్రభుత్వం

## మాజీ దేవస్థానం చైర్మన్ కొణతాల వెంకటరావు

**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 4 :** తెలుగు దేశం పార్టీ ముందు నుంచి హెచ్చరించిన విధంగానే వ్యవస్థలను నాశనం చేస్తుందని అందులో భాగంగానే ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంని నాశనం చేయాలని చూస్తున్నారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులుకొణతాల వెంకటరావు విమర్శించారు రైతాంగ ప్రయోజనాలను చేకూర్చే విధంగా నాటి రైతులు త్యాగాల ఫలితంగా 103 ఎకరాల భూములను రైతులు ఇచ్చారని దానిలో కేవలం వ్యవసాయాధార ఆధునాతన శాస్త్ర సాంకేతిక అభివృద్ధి కోసం నూతన వ్యవసాయ విధానానికి తూట్లు పొడిచి సదరు భూమిని వైద్య కళాశాలకు 30 ఎకరాలు కేటాయించామని చెప్పడం దానికి బదులుగా 50 ఎకరాల భూమి ప్రత్యామ్నాయంగా ఇస్తామని చెప్పడం చాలా విడ్డూరంగా ఉంది మీరు ఇవ్వబోయే 50 ఎకరాల్లోనే పట్టణ పరిధిలోని ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తే అందరూ స్వాగతిస్తారని అభివృద్ధి నిరోధకాలు ఎక్కడ ఎవరూ లేరని తెలుగుదేశం ప్రభుత్వం పట్టణ వాసులకు 2520 గృహాలు నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వగా వాటిని అడ్డుకొని వారి నోట్లో మట్టి కొట్టడం అభివృద్ధి అంటారా? పట్టణ పరిధిలో మీ పాలనలో ఒక్క సిమెంట్ రోడ్డు నిర్మాణం జరిగిందా ? రంగులు వేసి రంగుల తీయడానికి వేలకోట్లు దుర్వినియోగం చేయడం అభివృద్ధి అంటారా? తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీకి గత జనవరి నెలలో 10 లక్షలు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేని వారు 39 కోట్లు 500 కోట్లు గురించి అభివృద్ధి గురించి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు.

# విద్యుత్ నగదు బదిలీ కాదు ప్రభుత్వ బాధ్యత బదిలీ

## ఎంఎల్‌సి బుద్ధ నాగ జగదీశ్వరరావు



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 4 :** రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వ్యవసాయ విద్యుత్ నగదు బదిలీ నిర్ణయం సరైంది కాదని దీని వల్ల రైతులకు ఇబ్బందిలే తప్ప ప్రయోజనం శూన్యమని శాసనమండలి సభ్యులు శ్రీ బుద్ధ నాగ జగదీశ్వరరావు విమర్శించారు విద్యుత్ కష్టాలు తగ్గించేందుకు నగదు బదిలీ పథకాన్ని ప్రవేశపెడుతున్నామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించడం దుర్మార్గమని విద్యుత్ సంస్థలను సమర్థవంతంగా నడపడంలో విఫలమై రైతులపై భారం వేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేయడం రైతులను అందించడమే ఉచిత విద్యుత్తును తీసివేసేందుకే ప్రభుత్వం నగదు బదిలీ పేరుతో కుట్రకు తెరలేపింది. ప్రభుత్వం చేపట్టిన అనాలోచిత నిర్ణయంతో చిన్న కారు సన్నకారు రైతులు కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతారు రైతులు ఎంత మంది ఉన్నారు కౌలు రైతులు ఎంత మంది ఉన్నారు వాళ్లలో బ్యాంక్ ఎకౌంట్ ఎంతమందికి ఉన్నాయో ప్రభుత్వం వద్ద లెక్కలు ఉన్నాయా? విద్యుత్ కనెక్షన్ ఒక పేరు మీద. పొలం మరొక పేరు మీద ఉంటుంది. వారి పరిస్థితి ఏంటి? పాత అకౌంట్ లో డబ్బులు వేస్తే రైతుల పాత బకాయిలు కింద బ్యాంకర్లు జామ చేసుకుంటారని అందుకే కొత్త ఖాతాలు ప్రారంభించాలని చెప్పడం రైతులను అవమానించడం కాదా వైసిపి ప్రభుత్వం రైతుల పట్ల వ్యవహరిస్తున్న తీరుతో ఇప్పటికే రైతులు విత్తనాలు ఎరువులు పంట రుణాలు అందక ఇబ్బందులు పడుతున్నారు? ఇప్పుడు మళ్లీ ప్రభుత్వం నగదు బదిలీ పేరుతో రైతులను మరింత కష్టాల్లోకి నెట్టేందుకు ప్రయత్నిస్తుందని నాగ జగదీష్ తెలిపారు.

# అద్వాన్నంగా రోడ్లు.. అవస్థల్లో ప్రజలు

## నాటికీ, నేటికీ మారని రహదారులు



**ఉదయగిరి, వార్తావళి, సెప్టెంబర్ 4 :** ప్రపంచం ఎంతో వేగంగా మార్పు చెందుతుంది సమాజం ఇప్పటికి అభిరుద్ది వైపే అడుగులు వేస్తుంది అదేమిటో... ఒక్కపుడు రాజధాని, ప్రస్తుతం ఈ దేశానికి ఉపరాష్ట్ర పతిని అందించిన ప్రాంతం, ఎంతో చారిత్రిక వైభవం కలిగిన ప్రదేశం రాష్ట్ర రాజకీయ చిత్రపటంలో ప్రత్యేకత చాటుకున్న నియోజకవర్గం వెరసి ఉదయగిరి... నందవరం కూడలి నుండి కేవలం 30 కిలోమీటర్ల దూరం రహదారి విస్తరించ లేక పోవటం తో ప్రజలకు ఆ రహదారి నరక ప్రాయంగా మారింది. నిత్యం వాహనాలు తిరగటం అందులోనూ భారీ వాహనాలు రాకపోకలు సాగించటం తో ఒక వరుస రహదారి కుంగిపోయింది. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్డె నేటికీ మరమత్తు లకు నోచుకోక గుంటలు మెట్టలుగా మారిపోయింది. ఈ మధ్య కురిసిన వర్షానికి పూర్తిగా ధ్వంసం అయింది. రోగులను అంబులెన్స్ లో తీసుకుని ఈ రోడ్డులో వెళ్లే క్రమం లో ఆలస్యం జరిగి ప్రాణాలు పోయిన వారి సంఖ్య కూడా లెక్క లేనంతగా అయింది. పాలకులకు మాత్రం నందవరం ఉదయగిరి రెండువరుసల రోడ్డు రానాకియ నినాదంగా మారింది. రహదారి విస్తరణ లు జరిగి మెరుగైన రవాణా సౌకర్యం ఉంటేనే ఎలాంటి ప్రాంతం అయినా అభిరుద్ది జరుగుతుంది అంటారు.నెల్లూరు, ఆత్మకూరు, తిరుమల, చెన్నై, ఎక్కడికి వెళ్ళాలి అన్నా సీతారామపురం నుండి ఉదయగిరి వరకు ఉన్న అందరూ ఈ దారిలో వెళ్ళవలసిందే...! పాలకులు ఎందుకు ఈ ప్రాంత అభిరుద్ది మరిచారు అని ఉదయగిరి ఆత్మకూరు రెండు నియోజకవర్గా ల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కేవలం ముఫై కిలోమీటర్లు రహదారి ముంబై 567హైవే లో కలుపుకొంటే ప్రజలకు మెరుగైన రవాణా సౌలభ్యం కలుగుతుందని ప్రజలు కోరుతున్నారు. నరకానికి నఖలు గా ఉన్న ఈ రోడ్డు ను అభిరుద్ది చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

## రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్ బి. అంజాద్బాష



**కడప, వార్తావళి, సెప్టెంబర్ 4 :** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ బి. అంజాద్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి వర్యుల నివాసం నందు ఉప ముఖ్యమంత్రి వర్యులకు పలువురు బాధితులు తమ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా కడప పట్టణం ఇందిరా నగర్ కు చెందిన ఇ. రాణి తాను రైల్వేకోడూరులో సి హెచ్ సి నందు అవుట్సోర్సింగ్ కింద ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్గా పని చేయుచున్నానని అక్కడినుంచి తనను కడప మండలానికి బదిలీ చేయించాలని వినతిపత్రం సమర్పించారు. చింతకొమ్మదిన్నె మండలం నరసన్నపల్లెకు చెందిన సయ్యద్ రాజు తాను ఐటిఐ వెల్డర్ ట్రేడ్ పాస్ అయ్యానని తనకు అప్రెంటిస్షిప్ ఇప్పించాలని వినతి పత్రం సమర్పించారు. కడప పట్టణం నకాష్ కు చెందిన ఎస్.అంజుమ్ తన భర్త ఫిరోజ్ క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతున్నాడని ఉప ముఖ్యమంత్రి వర్యులకు తెలపగా వెంటనే ఉప ముఖ్యమంత్రివర్యులు స్పందించి ఒక నెలకు సరిపడా మాతర్లు ఉచితంగా ఇవ్వాలని పి ఎ. కాజాకు సూచించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు తమ సమస్యలను అర్జీ రూపంలో ఉపముఖ్యమంత్రి వర్యులకు అందజేశారు. బాధితుల సమస్యలన్నీ సంబంధిత అధికారులకు తెలియజేసి వెంటనే పరిస్కరిస్తామని ఉప ముఖ్యమంత్రి వర్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుబాన్ భాష, 31 వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి అజ్మతుల్లా, నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు షఫీ, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన చట్టాలను ఉల్లంగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



**సాలూరు, వార్తావళి, సెప్టెంబర్ 4 :** గిరిజన నాయకులు తుమ్మి అప్పలరాజు దొర పర్యటనలో భాగంగా విజయనగరం జిల్లా. పాచిపెంట మండలం. కుడుమురు రెవెన్యూ పరిధిలో గొట్టురు పంచాయతీ రాళ్లగుట్ట లో 1/70మరియు పిజా చట్టం అమలవుతున్న ప్రాంతం.. పాచిపెంట నుండి అరకు రహదారి నిర్మాణం అవుతున్న తరుణంలో సర్వే న0..48 లో సుమారు 782 ఎకరాలు అక్కడి గిరిజనులు తాత ముత్తాతలు నుండి పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నరు .డిమాండ్ పెరిగిన భూములపై గిరిజనేతురులు కన్ను పడింది. ఈభూములపై గిరిజనేతురులు వ్యక్తులు హవా సాగిస్తు తరుచు గిరిజనులు తో గొడవకు దిగుతూ .వాగ్వాదం కు ప్రయత్నిస్తున్నారు కాగా వారిని బెదిరిస్తున్నారు.. ఈ విషయంపై ఐటీడీఏ అధికారులు గానీ రెవెన్యూ అధికారులు గాని గిరిజనులు తరుపున స్పందించక పోవడం బాధాకరం..ఇప్పటికైనా గిరిజనుల చట్టాలపై ఉల్లంగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

# రిజర్వాయర్ ఎడమ కాలువకు గండి

**ఉదయగిరి, వార్తావళి, సెప్టెంబర్ 4 :** మండలంలోని గండిపాలెం పొన్నె బోయిన. చెంచు రామయ్య రిజర్వాయర్ ఎడమ కాలువ గండి పడటం తో వరద నీరు అంత వృధాగా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గండి పడిన ప్రదేశంలో కాలువ పై ఉన్న వంతెన కూలి పోయింది కూలిపోయి కుడా సుమారు రెండేళ్లు కావస్తున్నా ప్రాజెక్టు అధికారులు పట్టించుకోలేదు బ్రిడ్జి దెబ్బతినటంతో ఒత్తిడి కి లోను అయిన కాలువ గోడ విరిగి గండి పడింది. ప్రాజెక్టు నిండినా, నిండక పోయినా ప్రస్తుత సీజన్ లో వరదనీరు కాలువ ద్వారా వెళ్లి ఆయకట్టు గ్రామాల ఊట చెరువులు, కుంటలకు నీరు చేరుతుంది. గత ఏడాది ప్రాజెక్టు అధికారులు ఇసుకబస్తాలు వేసినీటిని అదుపుచేశారు. అవి కొట్టుకోని పోగా మళ్ళీ గ్రామ యువకులు కుడా స్వచ్ఛందంగా ఇసుక బస్తాలు వేశారు. అవి మళ్ళీ కొట్టుకుపోయాయి. ఫలితంగా నీరు మొత్తం వాగు లోకి వెళ్లి నక్కలగండి ప్రాజెక్టు కు చేరుతున్నాయి. దాని వల్ల ఆయకట్టు గ్రామాల రైతులకు నీటి కొరత ఏర్పడుతుంది. అధికారులు స్పందించి వెంటనే నీటిని అదుపు చేసి ఆదుకోవాలని రైతులు కోరుకుంటున్నాను.



# సచివాలయ రాతపరీక్షకు పకడ్బంధీ ఏర్పాట్లు

## జాయింట్ కలెక్టర్ డాక్టర్ మహేష్‌కుమార్



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 4 :** సచివాలయాల ఖాళీల భర్తీకోసం ఈ నెల 20 నుంచి ప్రారంభమయ్యే రాతపరీక్షకు పకడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ (అభివృద్ధి) డాక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల ప్రత్యేకాధికారులతో శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సమీక్షా సమావేశాన్ని జెసి నిర్వహించారు. పరీక్షా కేంద్రాలను ప్రతీ స్పెషల్ ఆఫీసర్ తనిఖీ చేసి, అక్కడ గుర్తించిన లోపాలు, సమస్యలను సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా జెసి మహేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ కేంద్రం వద్దా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందే అన్ని జాగ్రత్తలనూ తీసుకోవాలని ఆదేశించారు. సెంటర్ల స్పెషల్ ఆఫీసర్లు తరచూ పరీక్షా కేంద్రాలకు వెళ్లి, ఏర్పాట్లను తనిఖీ చేయాలన్నారు. గదుల్లో తగినంతగా గాలి, వెలుతురూ ఉండేలా చూడాలన్నారు. అభ్యర్థులకు త్రాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాన్ని కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఓ టి.వెంకటేశ్వర్రావు, జిల్లా పంచాయితీ అధికారి కె.సునీల్‌రాజ్‌కుమార్, జెడ్‌పి అకౌంట్స్ ఆఫీసర్ కె.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో రాళ్ళు నాటే పనులు పూర్తి చేయాలి

## ఐ.టి.డి.ఏ, ప్రాజెక్ట్ అధికారి కూర్మనాథ్



**గుమ్మలక్ష్మిపురం, వార్తావళి, సెప్టెంబర్ 4 :** ఆడవిమీద, అడవి సంపద మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న గిరిజనులు ఆడవిని, పర్యావరణాన్ని పరిరక్షిస్తారు అని ప్రాజెక్ట్ అధికారి ఆర్. కూర్మనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రాజెక్ట్ అధికారి తన పర్యటనలో భాగంగా గుమ్మలక్ష్మిపురం మండలం పర్యటించారు. మండలంలో తహశీల్దార్ కార్యాలయంలో ఆర్. ఓ.ఎఫ్.ఆర భూమి పట్టాల పంపిణీ నిమిత్తం చేపడుతున్న పనులను సమీక్షిం చారు, అనంతరం తహశీల్దార్ కార్యాలయం వెనుక హద్దులు నాటేందుకు సిద్ధంగా వున్న రాళ్ళు పరిశీలించారు. అనంతరం గుమ్మలక్ష్మిపురం మండలం డోకులగూడ గ్రామాన్ని సందర్శించి ఆర్. ఓ.ఎఫ్.అర్.పట్టాల పంపిణీ కి సంబంధించి హద్దు రాళ్ళు నాటే పనులు పరిశీలించారు. అనంతరం ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ ఈ నెల 8 తేదీ నాటికి హద్దు రాళ్ళు నాటే పనులు పూర్తి చేసి వాటికి ఫోటోలు తీసి వెంటనే సంబంధిత యాప్లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కురుపాం గుమ్మలక్ష్మిపురం మండలం ఆర్.ఓ.ఎఫ్.ఆర ప్రత్యేక అధికారి కె. నాగేశ్వరరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్, వి.అర్.ఓ లు ఇతర రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



మరణానంతరం తన మృతదేహాన్ని ఆంధ్రా మెడికల్ కాలేజి కి అప్పగించాలని వీలునామా రాసిన ఈస్ట్ పాయింట్ కాలనీ వాసి ఎన్ వి జగన్మోహన్ ఈరోజు స్వగృహంలో కన్ను మూశారు. అయన భార్య ద్వారా సమాచారం తెలుసుకున్న మిత్రులు మాజీ కార్పొరేటర్, సాయి పూజా ఫౌండేషన్ చైర్మన్ వానపల్లి రవికుమార్ సహాయంతో మృతదేహానికి కోవిద్ పరీక్ష చేయించి, ఆంధ్రా మెడికల్ కాలేజి అనాటమీ విభాగానికి స్నేహితుని కుమారుడు ప్రసాద్ ద్వారా భౌతికకాయాన్ని అందచేశారు. కుమారుడు అమెరికాలో ఉండటంతో తండ్రిని కడచూపు చూడలేకపోయారు.ప్రవీణ్, మురళీ, అతని స్నేహితులు అంతిమ వీడ్కోలు పలికారు.

**– అర్జా రాజేష్, వార్తావళి ఫోటోగ్రాఫర్, విశాఖపట్నం.**



సింహాచలం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా కొత్తగా వచ్చిన త్రినాధరావును మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన బీజెవైఎమ్ సభ్యులు విజయశంకర్ ఫణీంద్ర,శంకర్ మల్లవరపు,విశ్వహిందూ పరిషత్ సభ్యుడు పుడిపెద్ది శర్మ, బీజేపీ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు పల్లి మాధవిచార్లెస్ు

**– అర్జా రాజేష్, వార్తావళి ఫోటోగ్రాఫర్, విశాఖపట్నం.**



సిపిఎస్ రద్దు మరియు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ విశాఖపట్నం లోకసభ సభ్యుడు ఎమ్ వీ వీ సత్యనారాయణను కలిసి వినతి పత్రం అందచేస్తున్న విశాఖ పట్నం వైఎస్ఆర్టిసి మెడికల్ అండ్ హెల్త్ విభాగం అధ్యక్షుడు చల్లా చంద్రశేఖర్,జనరల్ సెక్రెటరీ రాజశేఖర్ రెడ్డి.రాజ్య సభ సభ్యుడు విజయసాయిరెడ్డి కు కూడా వినతి పత్రం అందచేసినట్లు చెప్పారు.

**– అర్జా రాజేష్, వార్తావళి ఫోటోగ్రాఫర్, విశాఖపట్నం.**

## తోలు బొమ్మల సిత్రాల బ్యానర్, వీడియో, లోగో ఆవిష్కరణ

### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు ఎస్ బి. అంజాద్బాష

**కడప, వార్తావళి, సెప్టెంబర్ 4 :** ప్రజలకు మంచి వినోదాన్ని అందించే కామెడీ హర్రర్ కథతో రూపొందించిన తోలు బొమ్మల సిత్రాల బ్యానర్ ను ఆవిష్కరించడం జరిగిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ బి.అంజాద్బాష పేర్కొన్నారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రివర్యుల నివాసం నందు ఉప ముఖ్యమంత్రి వర్యులు ఎస్ బి. అంజాద్బాష తోలు బొమ్మల సిత్రాల బ్యానర్ లోగో, వీడియోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జానకిరామ్ మాట్లాడుతూ ఈ చిత్రం యొక్క నిర్మాణ కార్యక్రమాలన్ని పూర్తయ్యాయన్నారు. ఈ బ్యానర్ ను ఉప ముఖ్యమంత్రి వర్యులు చేతుల మీదుగా ఆవిష్కరించడం ఎంతో శుభపరిణామమన్నారు. త్వరలో ఈ సినిమా టైటిల్ ను ప్రకటించడం జరుగుతుందన్నారు. తెలుగు ప్రజలందరూ ఈ బ్యానర్ ను, ఈ చిత్రాన్ని ఆదరించి ఆశీర్వదిస్తారని ఈ చిత్రం డైరెక్టర్ జానకిరామ్ కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఏం. ప్రభాకర్, మరియు తోలు బొమ్మల సిత్రాల టీం తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతలో లోపం ఉండకూడదు

### నాడు-నేడు పాఠశాల పరిశీలించిన జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్

**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 4 :** పాఠశాల నిర్మాణంలో మౌళిక సదుపాయాల కల్పనలో రాజీపడరాదని అవసరమైతే మరిన్ని నిధులు కేటాయిస్తామని జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ పేర్కొన్నారు. వి. మాడుగుల మండలం డి. సురవరం గ్రామంలో నిర్మించిన నాడు -నేడు డెమో పాఠశాలను (కె.జి.బి.వి. విద్యాలయాన్ని) ఆయన శుక్రవారం సందర్శించి పరిశీలించారు. సుమారు 50 లక్షల రూపాయలతో నిర్మించిన కాంపౌండ్ వాల్, పెయింటింగ్, మరుగుదొడ్లు, త్రాగునీరు, తదితర 9 రకాల నాడు-నేడు పనులను ఆయన క్షుణ్ణంగా ఆయన పరిశీలించారు. నిధులను సక్రమంగా వినియోగించుకున్నది లేనిది సర్వశిక్ష అభియాన్ పి.ఓ. మల్లిఖార్జు నరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. గ్రూపు కమిటీ



సభ్యులలోని ఒకరితో మాట్లాడుతూ ఇంకా ఏమైనా సౌకర్యాలకు నిధులు అవసరమని ఆయనను అడిగి తెలుసుకున్నారు. డైనింగ్ రూం, మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్, తదితర వాటిని ఆయన క్షణ్ణంగా పరిశీలించి నాణ్యతలో లోపం ఉండకూడదన్నారు.



మాకవరపాలెం మండలం తామరం గ్రామం లో పలు అభివృద్ధి కార్యక్రమలకు శంకుస్థాపన చేసిన గౌరవ శాసనసభ్యులు శ్రీ పెట్ల ఉమా శంకర గణేష్ గారు

**– వార్తావళి, మాకవరపాలెం**

## సీఎం ఆశయాలను అమలు పర్చని సచివాలయ ఉద్యోగులు

**గొలుగొండ, వార్తావళి, సెప్టెంబర్ 4 :** ప్రజల వద్దకే సంక్షేమ కార్యక్రమాలు అందించాలనే ఉద్దేశంతో వైయస్సార్ ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరువాత గ్రామ సచివాలయాలు, వాలంటీర్లు తో సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు నేరుగా అందించాలనే ఉద్దేశంతో గ్రామ సచివలయలు ప్రవేశపెడితే సచివాలయ ఉద్యోగులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి ..ఇప్పటికే అనేక గ్రామాల్లో సమయానికి రాక పోవడం, ఎవరికి నచ్చినట్టు వాళ్ళు పని చేస్తున్నరని విమర్శలు ఉన్నాయి. ఉన్నత అధికారుల పరిశీలన లేకపోవడంతో వీరి ఆగడాలకు అడ్డే లేకుండాపోతున్నాయ్. మండలంలో గల జోగంపేట సచివాలయం. లో రెవెన్యూ అధికారి గా పనిచేస్తున్న గోవర్ధన్ కుమార్ పై ఇప్పటికే అనేక ఆరోపణలు ఉన్నాయి . గతంలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రైతులు సచివాలయానికి రాగా వారి పై దురుసుగా ప్రవర్తిసున్నాడని, సచివాలయ ఉద్యోగులే అతని మందలించినట్టు అప్పట్లో పత్రికల్లో కథనాలు కూడా వెలువడ్డాయి. దీనిపై ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో తీరు మార్చుకోని విఆర్వో గోవర్ధన్ వృద్ధాప్య పింఛన్ కొరకు ఓ వృద్ధుడు రాబడి ధ్రువ పత్రం అవసరమై కొన్ని రోజుల కిందట మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నాడు ఆ దరఖాస్తును సచివాలయంలో పనిచేస్తున్న విఆర్వోకు అందజేయగా అది ఆయన బుట్ట దాఖలు చేశాడు. సర్టిఫికేట్ కొరకు ఆ వృద్ధుడు గురువారం వీఆర్వో ను సంప్రదించగా సమయం అయిపోయింది మరొకసారి దరఖాస్తు చేసుకోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్టు




ఆ వృద్దుపు విలేఖరులకు తెలియజేసాడు. దీంతో చేసేది లేక మరో 45 రూపాయలు చెల్లించి రాబడి ధృవపత్రం కోసం దరఖాస్తు చేసుకున్నాడు అయితే విధిగా ఆ దరఖాస్తును వి ఆర్ ఓ నే మండల రెవెన్యూ కార్యాలయం నకు పట్టుకెళ్ళి దరఖాస్తు పూర్తి చేయించి ధ్రువ పత్రం ఇప్పించవలసి ఉండగా ఆదరఖాస్తును మండల కేంద్రానికి పట్టుకెళ్ళి పొమ్మనిఆ వృద్ధుడికి సమాధానం చెప్పడం ఇక్కడసచివాలయ ఉద్యోగుల పనితీరుకు నిదర్శనం. గ్రామ నాయకులు గ్రామ సమస్యలపై వీఆర్వో ను సంప్రదిస్తే ఎవరికి పిర్యాదు చేసుకుంటారో చేసుకోండి అని సమాధానం చెప్పడం ఆయనకు విధి నిర్వహణ పై ఎంత శ్రద్ధ ఉందొ తెలుసుతుంది. ఎన్నో ఆశయాలతో ప్రజలకు ఇంటివద్దకే సంక్షేమ కార్యక్రమాలు అంద చేయాలని ముఖ్యమంత్రి ఆశలను ఇక్కడ సచివాలయ సిబ్బంది తుంగలో తొక్కడం పలు విమర్శలకు తావి స్తోంది. ఇప్పటికైనా సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించి ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు సచివాలయ కేంద్రంలోనే అందజేస్తారని పలువురు కోరుతున్నారు.

# ఆక్రమణకు గురైన 100కోట్ల ప్రభుత్వ ఆస్తిని తక్షణమే స్వాధీనం చేసుకోండి - సీపీఐ



**భీమిలి, వార్తావళి, సెప్టెంబర్ 4:** మధురవాడ సర్వే నెం 367 లో గల సుమారు 100 కోట్ల విలువైన 9.27 ఏకరముల ప్రభుత్వ భూమిలో బహుళ అంతస్తుల భవనాలు నిర్మించిన ఆక్రమణ దారులను తక్షణమే చట్టప్రకారం కఠినంగా శిక్షించి,ఆభవనాలు స్వాధీనం చేసుకొని ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కలెక్టర్ కు మెయిల్ ద్వారా సీపీఐ విశాఖ నగర కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు విజ్ఞప్తి చేసారు. 2016 ఆగష్టు నెలలో ఈభూమి అన్యాక్రాంతం జరిగిన అంశం గుర్తించి సీపీఐ తరుపున అప్పటి జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ కు పిర్యాదు చేశామని,విచారణ జరిపించి అభూమి ప్రభుత్వ భూమని రెవిన్యూ రికార్డులను మార్చి,అందులో నిర్మిస్తున్న భవనాలు అక్రమంగా నిర్మిస్తున్నవేననితేల్చి,ఆ భవనాలు నిర్మాణానికి ఇచ్చిన అన్ని అనుమతులు రద్దు చేసి స్వాధీనం చేసుకోవాలని ఉత్తర్వులు జారీచేసి నాలుగేళ్లు గడిచినా,కొంతమంది అధికారుల అవినీతి,అలసత్వం కారణంగా ఆక్రమణదారుల ఆగడాలు కొనసాగుతున్నాయని పైడి రాజు తెలిపారు.సమగ్రమైన విచారణ జరిపించి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విశాఖపట్నం లో కార్యనిర్వాహక రాజధాని ఏర్పాటుచేస్తున్న తరుణంలో తక్షణమే ఆ విలువైన ప్రజా ఆస్థిని స్వాధీనం చేసుకొని ప్రభుత్వ,ప్రజా అవసరాలకు వినియోగించుకోవాలని సీపీఐ తరపున పైడిరాజు కోరారు.

# దళితులకోసం దేనికైనా రెడీ

### దళిత బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు చింతాడ సూర్యం

**విశాఖపట్నం, ఉత్తరం, వార్తావళి, సెప్టెంబర్ 4:** నేటి సమాజంలో దళితుల మనుగడపట్ల అనేక సందేహాలు నెలకొంటున్నాయని దళితబహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు చింతాడ సూర్యం ఆవేదనగా అన్నారు.ఈ రోజు జరిగిన సమావేశంలో సూర్యం మాట్లాడుతూ దళితుల పట్ల సామాజిక స్పృహతో వ్యవహరించాలని కోరారు. దళితులకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను కాలరాస్తున్నారని సూర్యం ఆగ్రహం వ్యక్తం చేసారు.దళితుల సంక్షేమానికి ఎంతదూరానికైనా వెళ్తానని,దేనికీ వెనుకాడేది లేదని సూర్యం హెచ్చరించారు. ప్రభుత్వాలు, అధికారులు దళితులపట్ల సానుకూలధోరణితో వ్యవహరించాలని కోరారు.దళితులను మనుషులుగా చూడాలని,స్వార్ధపూరిత ఆలోచనలు మానుకోవాలని సూర్యం విజ్ఞప్తి చేసారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులపట్ల ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోలేదని సూర్యం అభిప్రాయపడ్డారు.దళితులపట్ల నిరంకుశంగా ప్రవర్తించేవారికి సమాజ బహిష్కరణ చేసేలా




చట్టాలు తేవాల్సిన అవసరముందని సూర్యం అన్నారు.దళితుల హక్కును కాపాడడానికి అన్నిసంఘాలను ఏకంచేసేవిధంగా కార్యాచరణ రూపొందిస్తానని సూర్యం చెప్పారు.సిటీ ప్రెసిడెంట్ మునపర్తి వెంకట్ రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో దళిత బహుజన సేన ప్రధాన కార్యదర్శి కొమ్ము వీరరాజు,స్టేట్ ఉపాధ్యక్షులు జాన్ విక్టర్,సిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ అడ్డాలసురేష్,నార్త్ ఇంచార్జి పిల్లిబాబీ,కుర్మా ఆదిత్య,గోకసురేష్ కుమార్, గండిరాజేశ్వరి, పూడిఅంజు, ధనాలక్ష్మి,ఫ్రాంక్లీ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

## పెట్రోల్ బంకులపై లీగల్ మెట్రాలజీ, పోలీస్ అధికారుల తనిఖీలు

**పశ్చిమ గోదావరి, వార్తావళి, సెప్టెంబర్ 2 :** పెట్రోల్ బంకుల్లో తక్కువ పెట్రోలు వచ్చే విధంగా ఎలక్ట్రానిక్ చిప్స్ అమర్చుతున్న ముఠా సభ్యులను తెలంగాణలో పోలీసులు అరెస్ట్. ముఠా సభ్యులు ఇచ్చిన సమాచారంతో జిల్లా లో ఉన్న పలు పెట్రోల్ బ్యాంకుల్లో జిల్లా ఎస్పీ నారాయణ నాయక్ ఆదేశాలతో తనిఖీలు. జిల్లాలో 11 పెట్రోల్ బంకుల్లో ఎలక్ట్రానిక్స్ చిప్స్ అమర్చినట్లు గుర్తించిన పోలీస్ అధికారులు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెబుతున్న పోలీసులు అధికారులు.

# మాస్కేసినా మసకుండదు!



మాస్కు ధరించిన తర్వాత కండ్లజోడు పెట్టుకున్నా.. కండ్లజోడే ముందు ధరించి.. తర్వాత మాస్కు పెట్టుకున్నా.. అద్దాలపై తేమ చేరకుండా ఉండదు. మన ముక్కు నుంచి వదిలిన గాలి.. కండ్లజోడులోకి జొరబడి.. అద్దాలపై పొగలా పేరుకుపోతుంది. ఆఫీస్‌కు బయల్దేరాడు వరుణ్. పార్కింగ్‌లోకి వచ్చాడు. మాస్కు ధరించాడు. హెల్మెట్ పెట్టుకున్నాడు. చలువ కండ్లజోడు ధరించాడు. బైక్ స్టార్ట్ కాలేదు. నాలుగైదు సార్లు కిక్ కొట్టాక స్టార్ట్ అవ్వడంతో.. హమ్మయ్య అనుకుంటూ దీర్ఘంగా శ్వాస వదిలాడు. అంతే... వరుణ్ చూపు మందగించింది. కొండలను కప్పేసే పొగమంచులా.. మాస్కులో నుంచి వచ్చిన గాలి.. కండ్లజోడులోకి చొచ్చుకొని పోయింది. అద్దాలపై పొగలా పేరుకుపోయింది. బండి మీద ఏమవుతుందిలే అనుకొని.. మాస్కు తీసేశాడు వరుణ్. అద్దాలను ఓసారి తుడిచి రిస్కీ ప్రయాణం మొదలుపెట్టాడు. ఒక్క వరుణే కాదు.. చాలా మంది కండ్లజోడుపై పొగబారుతున్నదని ప్రయాణ వేళల్లో, ఇతర సమయాల్లో మాస్కు ధరించడంలేదు. కండ్లల్లో దుమ్ముపడితే ఫర్వాలేదు.. కానీ, కరోనా క్రిమి ముక్కులోకి దూరిపోతే.. ప్రాణానికే ప్రమాదం. అందుకే ఈ టిప్స్ ఫాలో అయిపోండి. మాస్కు తొలగించకుండా.. కండ్లజోడు మసకబారకుండా.. జాగ్రత్తగా ఉండండి. కళ్లద్దాలను సబ్బుతో గానీ, లిక్విడ్ సోప్‌తో గానీ కడగండి. నీటితో శుభ్రం చేసి ఆరనివ్వండి. సబ్బునీళ్లు కండ్లద్దాలపై ఒత్తిడి తగ్గించి తేమ నిలవకుండా చేస్తుంది. షేవింగ్ ఫోమ్‌తో కళ్లజోడును శుభ్రం చేసినా.. కండ్లద్దాలు పొగచూరకుండా ఉంటాయి. మార్కెట్‌లో డీమిస్టింగ్ స్ప్రేలు అందుబాటులో ఉన్నాయి. కండ్లజోడు ధరించడానికి ముందు ఈ స్ప్రే చేస్తే చాలు.. కాసేపటి వరకు హాయిగా ఊపిరి పీల్చుకోవచ్చు. ముక్కు, చెక్కిళ్ల మధ్య గ్యాప్ లేని మాస్కులు ధరిస్తే... శ్వాస వదిలినప్పుడు గాలి పైకి కాకుండా కిందికి వెళ్లిపోతుంది. గ్యాప్ ఉంటే.. టిష్యూపేపర్ కొద్దిగా తడిపి.. ఖాళీని పూరించండి. శ్వాస వదిలినప్పుడు వచ్చే గాలిని అది పీల్చుకుంటుంది.

## ఈ సెన్సర్.. చెమటను చదివేస్తుంది!



నానోసెల్యూలోస్, ప్యూర్ పాలిమర్‌తో ఒక సెన్సర్‌ని రూపొందించారు బ్రెజిల్ పరిశోధకులు. ఈ సెన్సర్ ద్వారా చెమట నుంచి మనలో జరిగే జీవక్రియను గుర్తిస్తారు. ఇప్పటివరకు వచ్చిన అనేక సెన్సర్లను గమనిస్తే.. చర్మ రంధ్రాలు, చర్మం సెన్సర్ల మధ్య చెమట ఒక అవరోధంగా ఉండేది. కానీ ఇది అలా కాదు.. చెమట ద్వారానే గుర్తించేలా ఈ సెన్సర్ రూపకల్పన జరిగింది. మామూలుగా అయితే ఏదైనా అలెర్జీ, ప్రతిచర్యలను గుర్తించడానికి చెమట ఆటంకం కలిగిస్తుంది. ఇది అలా కాకుండా.. ఇందులో ఉండే నానోసెల్యూలోస్ ఆ చెమటను తీసేసుకుంటుంది. ఎలక్ట్రోడ్ సజీవ పొరలోకి చెమట వెళ్లిపోతుంది. కార్బన్ దాని ముఖ్యమైన విద్యుత్ వాహకంగా పనిచేస్తుంది. పరిశోధనను అభివృద్ధి చేసి ఈ వ్యవస్థ ద్వారా జీవక్రియను గమనించి ఔషధాలను తయారు చేస్తామని చెబుతున్నారు అక్కడి పరిశోధకులు. చెమటలో లోహ అయాన్లు, బయోమార్కర్లను గుర్తించడానికి ఎలక్ట్రో కెమికల్ సెన్సర్లలో ఉపయోగించే నానోసెల్యూలోస్‌తో దీన్ని రూపొందించారు.

# రాక్ బాటమ్ డేస్‌తో మీ చేతుల చొక్కాను పైకి మడవండి

**తిరుపతి, వార్తావళి, సెప్టెంబర్ 4 :** మీరు బ్రాండెడ్ షర్ట్‌లు కొనాలనుకుంటే, అతితక్కువ ధరకు అత్యుత్తమ బ్రాండ్లను కొనడానికి ఇప్పటి కంటే ఉత్తమ సమయం మరొకటి లేదు. బ్రాండ్ ఫ్యాక్టరీ రాక్ బాటమ్ డేస్ మీకు ఇష్టమైన హైలేండర్, రోజెన్, క్రొకోడైల్, ట్విల్స్, కూల్ కలర్స్, కలర్స్, టర్టిల్, పెపె జీన్స్, క్రిమ్‌సోనే క్లబ్, సీలియో, ది ప్రివిలేజ్ క్లబ్, బేర్ లీజర్, నైట్‌హుడ్, జాన్ మిల్లర్, బఫెలో, ఇండిగో నేషన్ మరియు లీ కూపర్ లాంటి ఫ్యాషన్ బ్రాండ్‌లపై మీకు అత్యుత్తమ ఆఫర్‌లు తీసుకొస్తోంది.అనేక రకాల షర్ట్‌లు ముందెప్పుడూ లభించనంత తక్కువ ధరకు ఇప్పుడు లభిస్తున్నాయి, అవి ఫార్మల్, క్యాజువల్, సెమి ఫార్మల్, హాఫ్-స్లీవ్ లేదా ఫుల్ స్లీవ్స్, క్లాసిక్ వైట్ షర్ట్, ఆక్స్‌ఫర్డ్ బటన్-డౌన్ షర్ట్, ప్రింటెడ్, స్ట్రైప్‌డ్ లేదా చెక్స్ షర్ట్ లేదా బ్యాండ్ కాలర్డ్ షర్ట్ కావచ్చు. రూ. 1699 మరియు అంతకంటే తక్కువ ధర గల షర్ట్‌లకు, కొనండి 3 కేవలం రూ. 1699కే, రూ. 1700 నుంచి రూ. 2299 ఎంఆర్‌పికి, కొనండి 2 కేవలం రూ. 1699కే మరియు రూ. 2300 కంటే ఎక్కువ ధర గల షర్ట్‌లకు, ఫ్లాట్ 50% తగ్గింపు పొందండి.మీకు ఇప్పటికంటే మెరుగైన అవకాశం మళ్ళీ లభించదు! ఆకర్షణీయమైన ఈ ఆఫర్‌లను 2 నుంచి 6 సెప్టెంబరు 2020 వరకు వినియోగించుకోండి మరియు ఎంపికచేసిన సరుకుపై మాత్రమే వర్తించే, బ్రాండ్ ఫ్యాక్టరీ రాక్ బాటమ్ డేస్ విక్రయం సమయంలో మీ వార్డ్రోబ్‌ని నింపేసుకోండి. మీరు మా స్టోర్‌కి విచ్చేసినప్పుడు సంవత్సరంలో 365 రోజులూ 20-70% తగ్గింపుతో లభించే 200o ఒరిజినల్ బ్రాండ్స్‌తో అత్యుత్తమ ఫ్యాషన్ అన్వేషించండి! అంతే కాదు... బ్రాండ్ ఫ్యాక్టరీలో సురక్షిత మైన మరియు సంతోషభరితమైన కుటుంబ షాపింగ్ అనుభవం ఆనందించండి. స్టోర్‌లో కాంటాక్టు లేకుండా షాపింగ్ చేయడానికి మీకు వీలు కల్పించే సహాయపడే షాపింగ్ మరియు నిపుణులైన సిబ్బంది



ద్వారా వీడియో కాల్ అసిస్టెన్స్‌తో మీ ఇంటి నుంచే సౌకర్యవంతంగా షాపింగ్ చేయడానికి వర్చువల్ షాపింగ్ లాంటి కొత్త మరియు సురక్షితమైన మార్గాలతో, బ్రాండ్ ఫ్యాక్టరీలో మేము ఎల్లప్పుడూ సురక్షితకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తాము. మీరు చేయవలసిందల్లా 75063 13001కి మిస్డ్ కాల్ చేసి అపాయింట్‌మెంట్ బుక్ చేసుకోవడమే. బ్రాండ్ ఫ్యాక్టరీ సిఇఒ సురేష్ సధ్వాని ఇలా అంటున్నారు, "టాప్ బ్రాండ్స్‌ని తక్కువ ధరకు మా కస్టమర్‌లకు అందించేందుకు, ప్రత్యేకించి ఈ మహమ్మారి కాలంలో తలెత్తిన ఆర్థిక సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకొని రాక్ బాటమ్ డేస్‌ని రూపొందించడమైనది. ఇంకా, మా స్టోర్స్‌లో పెంచిన సురక్షిత చర్యలు, బ్రాండ్ ఫ్యాక్టరీలో మా కస్టమర్‌లందరికీ చీకూచింతా లేని షాపింగ్ చేయవచ్చనే చాలా అవసరమైన హామీ ఇస్తాయి, ఎందుకంటే షాపింగ్‌పై మేము భారీ డిస్కౌంట్లు ఇస్తాము, కానీ సురక్షితపై ఖచ్చితంగా డిస్కౌంట్ ఉండదు!"

Printed, Published and Owned by B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh.
Editor B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh. Email : bulusu009@gmail.com, Cell : 8500159006